నవతెలంగాణ 6
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 20 జూన్ 2023



విశ్రాంత ఎంపీడీఓ హత్య కేసులో నిధుతులను కఠినంగా శిక్షించాలి

సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణ-చేర్యాల

నాలుగు రోజుల క్రితం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామానికి చెందిన విశ్రాంత ఎంపీడీఓ రామకృష్ణయ్యను పథకం ప్రకారం కిడ్నప్ చేసి హత్య చేసిన బీఆర్ఎస్‌కు చెందిన జనగామ జడ్పీ వైస్ చైర్మన్ భర్త గిరిబోయిన అంజయ్యతో పాటు మిగతా నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాల మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ 'జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్



నాయకులుంతా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ యథేచ్ఛగా అమ్ముతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారు. వినకపోతే హత్యలు చేస్తున్నారు. ఇది రాజకీయాల్లో మంచి పద్ధతి కాదు' అని అన్నారు. రామకృష్ణయ్య మృతి వెనుక జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హస్తం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. వరుస హత్యలను చూస్తే రౌడీ రాజకీయాలు నడుస్తున్నాయని తెలిపారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రజలందరిని సమాన దృష్టితో చూడాలని, భవిష్యత్తులో ఈ హత్య లు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఎంపీడీఓ మృతికి కారకులపై రౌడీ షీట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ దాసరి కళావతి,కొమురవెల్లి, చేర్యాల మండలాల కార్యదర్శులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట మావో జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, నాయకులు ఆముదాల రంజిత్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో రాగి జావ

నేడు విద్యా దినోత్సవం



- మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ
- పౌష్టికాహారలోపం అధిగమించే ఉద్దేశం
- ప్రాథమిక స్కూల్ విద్యార్థులకు వర్క్‌బుక్స్
- హైస్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితం
- రెండు జతల యూనిఫామ్స్


మధ్యాహ్న భోజనం కొత్త మెనూ

సోమవారం: కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
మంగళవారం: అన్నం, సాంబరు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
బుధవారం: అన్నం, ఆకుకూరపప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
గురువారం: వెజిటబుల్ బిర్యానీ, వెజిటబుల్ కర్రీ
శుక్రవారం: అన్నం, సాంబరు, వెజిటబుల్ కర్రీ
శనివారం: అన్నం, ఆకుకూర పప్పు, వెజిటబుల్ కర్రీ
ప్రతి రోజూ: ప్రార్థనా సమయానికి ముందు 250 మిల్లీ లీటర్ల రాగిజావ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కార్ బడుల్లో చదువుకునే విద్యార్థులకు రాగిజావ, కొత్త మెనూతో కూడిన మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. అన్నం, పప్పు, సాంబారుతో కూడిన మధ్యాహ్న భోజనం కాకుండా పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు దోహదపడేలా అన్నం, గుడ్డు, ఆకుకూరపప్పు, వెజిటబుల్ కర్రీ, బిర్యానీ, కిచిడీ, సాంబారుతో భోజనం పెట్టనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ, పౌష్టికాహారం భోజనం అందించనున్నారు. లక్షలాది మంది విద్యార్థులకు రక్తహీనత వంటి సమస్యలు తొలగిపోనున్నాయి.

250 మిల్లీ లీటర్ల రాగిజావ



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లోని పేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. వీరికి ఒక పూట భోజనం దొరకడమూ కష్టంగా ఉన్నదని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. విద్యార్థుల్లో రక్తహీనత, శారీరక, మానసిక బలహీనతలతో బాధపడుతున్నారని పలు సర్వే సంస్థలు గుర్తించాయి. పౌష్టికాహార లోపం వల్లనే విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా పౌష్టికాహారమైన రాగి జావను విద్యార్థులకు అందించనున్నారు. ప్రతి విద్యార్థికి రోజూ ఉదయం ప్రార్థన సమయానికి ముందు 250 మిల్లీ లీటర్ల రాగిజావను అందించనున్నారు.

3.50 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం వంటి అనారోగ్య సమస్యల నుంచి అధిగమించేందుకు వీలుగా రాగిజావ, పౌష్టికమైన భోజనం అందించనున్నారు. ప్రొటీన్స్, ఇతర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందించనున్నారు. మెదక్ జిల్లాలో 1062 ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో లక్ష మంది విద్యార్థుల వరకు చదువుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1260 ప్రభుత్వ పాఠశాలల్లో 1.30 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 1262 ప్రభుత్వ పాఠశాలల్లో 1.25 లక్షల మంది చదువుకుంటున్నారు.



మూడు జిల్లాల్లో కలిపి 3.50 లక్షల మంది విద్యార్థులకు సెలవు దినాలు మినహా అన్ని రోజుల్లోనూ రోజూ రాగిజావ అందించనున్నారు.

ఇతర సదుపాయాలు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చదువులు సాఫీగా సాగేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోట్ బుక్స్ కూడా అందజేయనున్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలిస్తారు. ఈ సారి 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మూడు చొప్పున ఉచితంగా వర్క్ బుక్స్ ఇస్తారు. 6 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సబ్జెక్టుకు ఒకటి చొప్పున నోట్‌బుక్స్ కూడా అందిస్తారు. వీటితో పాటు రెండు జతల యూనిఫామ్స్ అందిస్తారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం

రాగిజావ, పౌష్టికమైన మధ్యాహ్న భోజనం అందించడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. రాగులు శ్రేష్ఠమైన ఆహారం. కాబట్టి జావ తాగడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. కొత్త మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించనున్నారు. వీటిని తీసుకోవడం ద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు.

- వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా అధికారి

నాణ్యత పాటించాలి

విద్యార్థులకు రాగిజావ, కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడం మంచి విషయం. వాటిని నాణ్యంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కొన్ని స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజనం పెట్టే కాంట్రాక్టు అప్పజెప్పడం వల్ల విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారు. రాగిజావ, కొత్త మెనూ ప్రకారం భోజనాన్ని మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారానే అందించాలి. బిల్లులు రెగ్యులర్‌గా విడుదల చేయాలి. అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందే అవకాశముంది.

- రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

హరితహారంతో పెరిగిన వనసంపద

జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

నవ తెలంగాణ కొండపాక



హరితహారంతో జిల్లాకు వనసంపద పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. సోమవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో మర్పడగల్ గల ఆక్సిజన్ పార్కులో హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, పాఠశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హరితహారం కార్యక్రమం ద్వారా మరో విడతలో మొక్కలు నాటే కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో తొమ్మిది సంవత్సరాల కాలంలో తెలంగాణకు హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్థిక,వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు మార్గదర్శకత్వంలో జిల్లాలో 7 కోట్ల 28 లక్షల మొక్కలు నాటి సంరక్షించడం జరిగిందన్నారు. తద్వారా జిల్లాలో 6.4 శాతం నుండి 14 శాతానికి గ్రీన్ కవర్ పెరిగిందన్నారు. పచ్చదనం పెరగడంతో జిల్లా ప్రజలకు, పశుపక్షాదులకు మంచి గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. చెట్లు ఎక్కువ ఉంటే చెట్ల ఆకుల నుండి నీరు భాష్పీభవనం ద్వారా ఆకాశంలోకి వెళ్లి మేఘాలను ఆకర్షిస్తాయని తద్వారా వర్షాలు కురుస్తాయన్నారు. ఈ విధంగా ఒక సైకిల్ పద్ధతిలో మొక్కలు ఉంటే వర్షం పడి ఆ వర్షానికి అధికంగా మొక్కలు పెరిగి అధిక వర్షం కురుస్తుందని అన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్కను దత్తత తీసుకొని పెంచాలని అన్నారు. ఎప్పటికీ నీటిని ఉంచే గొప్ప శక్తి వృక్షాలని ఒక మొక్క పెరిగి వృక్షంగా పెద్దదవడానికి పది సంవత్సరాల టైం పడుతుంది కాబట్టి మొక్కలను నరకరాదని అన్నారు. కార్యక్రమంలో మర్పడగ సర్పంచ్ రజిత, మర్పడగ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పట్టణంలో అర్హులైన పేదలందరికీ సిద్ధాపూర్ కాలనీలో గల సర్వే నంబర్ 260 ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి. జయరాజ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఎంపికలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ మనోహర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అనేక ఏండ్ల నుంచి సదాశివపేట పట్టణంలో పేదలు ఇరుకిరుకు గదుల్లో నివాసం ఉంటూ కిరాయి కట్టలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వారు అనేక సార్లు దరఖాస్తు పెట్టుకున్నా ఇండ్ల స్థలం రావడం లేదన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలిస్తామని ఐదేండ్ల కాలంలో పేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేసినా.. భూమి పొజిషన్ ఇంతవరకు చూపించలేదని, తక్షణమే భూమి పొజిషన్ చూపించాలని డిమాండ్ చేశారు. ఐదేండ్ల కాలంలో డబుల్ బెడ్ రూమ్ ఎంపికలో అనేక అక్రమాలు జరిగాయని.. ఇల్లు ఉన్న వారికే డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించారని డిమాండ్ చేశారు. ఈ అవకతవకలపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి.. అసలైన అర్హులకే ఇండ్లు కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన మేరకు తక్షణమే సదాశివపేట పట్టణంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని లేనియెడల ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతి పేదలకు అందరికీ జాగాలు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మహేష్, ఎండి పాషా గౌస్, ఖలీల్ పటేల్, షారు, ఆజీజ్, ప్రేమ్ దాస్, సుధాకర్, స్వరూప, రజ్యాన, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొల్కూర్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి

- బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలి
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో డీఆర్వో నగేష్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



భానామతి పేరుతో ఓ కుటుంబాన్ని చెట్టుకు కట్టేసి చితకబాదిన కొల్కూర్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలనికే వీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో డీఆర్‌ఓ ఎం.నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాణిక్యం మాట్లాడుతూ.. సదాశివపేట మండలం కొల్కూర్ గ్రామంలో దేవుడి చేస్తున్నానని నెపంతో ఈ నెల 17న దళిత సామాజిక వర్గానికి చెందిన మూతంగి యాదయ్య అతని భార్య, కొడుకు, కోహిర్ శ్యామమ్మను ఊరి నడిబొడ్డున చెట్టుకు వేలాడదీసి కొట్టారని.. ఇది సరికాదన్నారు. ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి వైపు అడుగులేస్తుంటే గ్రామంలో మాత్రం సభ్య సమాజం తలదించుకునేలా ఉండన్నారు. 6 గంటల పాటు చెట్టుకు వేలాడదీసి కొడుతుంటే.. తమను వదలండి అంటూ బాధితులు ఎంత మొరపెట్టుకున్న కనికరించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనలో అగ్రకుల వ్యక్తులు కూడా ఉన్నారని సమగ్ర విచారణ జరపాలని అగ్రకుల వ్యక్తులపై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. యాదయ్యకు ఇద్దరు పిల్లలు ఉన్నారని ఒకరు దివ్యాంగురాలని బిక్షం బిక్కుమాంటూ వేరే గ్రామంలో తల దాచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆర్థిక సహకారాలు అందించాలని మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు వి. అశోక్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ జిల్లా కమిటీ సభ్యులు దాస్,ప్రభాకర్, గంగారం పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

నవతెలంగాణ-జిన్నారం: ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా మన ఊరు-మన బడి ప్రారంభించారని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలం కిష్టాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, మన ఊరు-మనబడి పథకం ద్వారా పూర్తిచేసిన వివిధ అభివృద్ధి పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అలాగే మండల కేంద్రమైన జిన్నారంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామం నుండి పాఠశాల వరకు ఎమ్మెల్యే ల్యాండ్ ఫరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన ఊరు-మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏడు వేల కోట్ల రూపాయలతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో 55 పాఠశాలలను ఎంపిక చేసి పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రధానంగా నీటి సౌకర్యంతో కూడిన టాయిలెట్లు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థుల,



సిబ్బందికి సరిపడే ఫర్నిచర్, పాఠశాల మొత్తం పెయింటింగ్,గ్రీన్ చాక్ బోర్డులు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త క్లాస్ రూంలు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయడం లాంటి సౌకర్యాలు కల్పించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అవినీతికి తావులేకుండా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిధులు ఖర్చు చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్, జడ్పిటిసి కొలన్ బాల్ రెడ్డి, ఎంపీటీసీ వెంట సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్,బీఆర్ఎస్ రాష్ట్ర నేత వెంకటేష్ గౌడ్, గడ్డపోతారం సర్పంచ్ ప్రకాష్ చారి, జిన్నారం సర్పంచ్ లంక లక్ష్మి లావణ్య శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ అధికారి విజయ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవ తెలంగాణ కొండపాక



చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన సుమన్‌రెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు మండలం కొక్కొండ గ్రామంలో గల బండచెరువు విస్తీర్ణం 40 ఎకరాలు చెరువు ఉందన్నారు. దీని పరిధిలో ఆయకట్టు విస్తీర్ణం 300 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం 360, 361 సర్వే నెంబర్లలో 5 ఎకరాల భూమి ఎఫ్‌టీఎల్‌లో మట్టిని పోసి హైదరాబాదుకు చెందిన సుమన్‌రెడ్డి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ఈ నిర్మాణంతో వర్షాలకు చెరువు నిండి రోడ్డుపైకి రావడం, చెరువు విస్తీర్ణం తగ్గిపోవడం జరుగుతుందన్నారు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుందన్నారు. వ్యవసాయ పొలాలకు వచ్చే కాల్వలు పూడ్చి పెట్టాలో పంపు కోసం నిర్మాణం చేయడంతో కలుషితం జరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయదారులకు, గ్రామానికి ప్రమాదం ఉన్న కారణంగా అక్రమంగా చెరువులో నిర్మిస్తున్న నిర్మాణాలను రద్దు చేయాలని, చెరువు భూమిని కాపాడాలని కోరారు.

పటాన్‌చెరు పారిశ్రామిక వాడకు పెద్దాసుపత్రి

- 22న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- 200 పడకలు, అత్యాధునిక వసతులు, ఆధునిక శస్త్ర చికిత్సలు
- జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నవ తెలంగాణ - పటాన్ చెరు

దశాబ్దాల కాలంగా కాలుష్యంతో సహజీవనం చేసి అంతు చిక్కని వ్యాధులు, అనారోగ్యాలతో ఆర్థికంగా, ఆరోగ్యపరమైన సమస్యలతో తీవ్ర ఇబ్బందులు గురైన పటాన్‌చెరు పారిశ్రామిక ప్రజలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషితో అత్యాధునిక సౌకర్యాలు, ఆధునిక శస్త్ర చికిత్సలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు కొల్లూరు డబుల్ బెడ్ రూమ్‌ల ప్రారంభోత్సవం అనంతరం 11 గంటలకు పటాన్ చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పక్కన నిర్మించ తలపెట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్‌తో కలిసి సీఎం సభా స్థలిని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఎం కేసీఆర్ పర్యటన వివరాలు, ఆసుపత్రి నిర్మాణ నమూనాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో 82 జారీ చేసిందన్నారు. ఆస్పత్రి నిర్మాణం కోసం 184 కోట్ల 87 లక్షల 55 వేల రూపాయల నిధులు మంజూరు కాగా మొత్తం వ్యయంలో 25 శాతం అనగా 46 కోట్ల 21 లక్షల 88 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందగా, మిగిలిన 75 శాతం రూ.138,65,66,287లను తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఖర్చు చేయనుందని తెలిపారు. సివిల్ వర్క్స్ నిర్మాణం, పరికరాలు, ఫర్నిచర్, ల్యాబ్ సేకరణ తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పనులు జరుగనున్నాయని తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ నియంత్రణలో 200 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతంలో వెలువడే కాలుష్యం



మూలంగా వచ్చే వ్యాధులను గుర్తించి అందుకు అవసరమైన వైద్య విభాగాలను, నిపుణులైన వైద్యుల ఆస్పత్రిలో అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. ప్రధానంగా పారిశ్రామికవాడల్లో జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్స విభాగాలు సైతం ఇందులో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి నిధులు సిద్ధంగా ఉన్నాయని, శర వేగంగా ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీష్ రావు లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

పాత పెన్షన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ విద్యాసాగర్

నవ తెలంగాణ రాయపోల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పాత పెన్షన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ విద్యాసాగర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయడం అనేది రాష్ట్ర పరిధిలోని అంశమన్నారు. సిపిఎస్‌ను రాష్ట్రమే రద్దు చేయాలన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే సిపిఎస్ ను రద్దు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ వచ్చి పది సంవత్సరాలు గడిచిన సందర్భంగా రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా జరుపుకుంటున్న సమయంలో సిపిఎస్ ఉద్యోగులు మాత్రం ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ కోసం రోడ్ల మీదికి వచ్చి సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు గుదిబండగా మారిన ఈ సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వాన్ని పాత పెన్షన్ సాధన సమితి రాష్ట్ర శాఖ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి డిమాండ్

నవ తెలంగాణ - గజ్వేల్



ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. సోమవారం గజ్వేల్ కార్యాలయంలో డివిజన్ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో తాటికొండ రవి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్య అందించాలన్నారు. సిద్దిపేట జిల్లాలో అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. అనేక కార్పొరేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులను పీడిస్తూ పాఠశాలలు నడుపుతున్నారని తెలిపారు. అనుమతులు లేకుండానే విద్యాసంస్థలు పనులు సంబంధిత జిల్లాలో ప్రారంభిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా నడిచే విద్యా సంస్థలను, అర్హతలు అమ్మే యూనిఫామ్స్ మార్కెట్లుగా డిమాండ్ చేశారు. యూనిఫాం, షూస్, టై, బుక్స్, స్పోర్ట్స్ డ్రెస్ తదితర మెటీరియల్ తమ పాఠశాలల్లోనే తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. బుక్స్, యూనిఫామ్ పేరుతో వేల రూపాయల ఫీజు వసూలు చేస్తున్నారని, జిల్లా అధికారులు ఫీజుల నియంత్రణ చేయకపోతే పాఠశాలల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. మండల అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రెడ్డమైన అరవింద్, దాసరి ప్రశాంత్, సహాయ కార్యదర్శి నాదారం శేఖర్, అభిషేక్,నవీన్, నితిన్ దీక్షిత్, శివ పాల్గొన్నారు.

హుస్నాబాద్‌ను ముద్దాడనున్న గోదావరి జలాలు

- పూర్తయిన గౌరవెల్లి ప్రాజెక్ట్
- సస్యశ్యామలం కాబోతున్న మెట్ట ప్రాంతం
- 25 తర్వాత సీఎం కేసీఆర్ రాక
- ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్

నవతెలంగాణ-అక్కన్నపేట





మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నేలను గోదావరి జలాలు వారం రోజుల్లో తాకనున్నాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ అన్నారు. సోమవారం గౌరవెల్లి ప్రాజెక్టు పనులను ఆయన సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు దగ్గర ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాతనే హుస్నాబాద్‌కు గోదావరి జలాలు రావడం జరిగిందని అన్నారు. ఈ ప్రాంత రైతుల కల నెరవేరబోతుందని అన్నారు. గత 40-50 సంవత్సరాల కల అన్నారు. త్వరలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని తెలియజేశారు. గోదావరి జలాలు ఎస్ఆర్ఎస్పీ ద్వారా 120 కిలోమీటర్లు ప్రయాణించి గౌరవెల్లి ప్రాజెక్టును చేరుతున్నాయని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 1 లక్ష6 వేల ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. ఇంతటి మహత్తర ప్రాజెక్టు పూర్తికావడానికి సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, నిర్వాసితులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు ద్వారానే రైతులకు 365 రోజులు నీరందుతుందని అన్నారు. మొత్తం ప్రాజెక్టు సామర్థ్యం 8.23 టీఎంసీలు ఉందని తెలియజేశారు. ఈ ప్రాజెక్టు కోసం 11 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ వర్క్ జరిగిందని, ప్రాజెక్టుకోసం రెండు మోటార్ల ద్వారా ఎప్పుడు నీరు వస్తుందని, ఒక మోటార్ అదనంగా ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం నిర్వాసితులు 3,870 ఎకరాలు త్యాగం చేశారని గుర్తు చేసుకున్నారు. మొత్తం హుస్నాబాద్ నియోజకవర్గానికి 57,852 ఎకరాలకు నీరు అందుతుందని, అక్కన్నపేట మండలానికి 4,228, హుస్నాబాద్ మండలానికి 10,582, కోహెడ మండలానికి 11,900, సైదాపూర్ మండలానికి 5671, చిగురు మామిడి మండలానికి 14,963, భీమదేవరపల్లి మండలానికి10,508 ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని ఆకాంక్షించారు. అలాగే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి 48,148 ఎకరాలకు నీరు ఈ ప్రాజెక్టు ద్వారానే వెళ్తుందని తెలియజేశారు. ఇందులోకి కుడివైపు కాలువ 47.7 కిలోమీటర్లు ఉందని, దీని ద్వారా 90 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎడమ కాలువ ద్వారా 16 కిలోమీటర్లు ప్రయాణించి, 16 వేల ఎకరాలకు నీరు అందనుంది. అలాగే త్వరలో గండిపల్లి ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని దీని ద్వారా 14 వేల ఎకరాలకు నీరు అందనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి నాయక్, హుస్నాబాద్ జడ్పీ చైర్మన్ దా సుదీర్ కుమార్, అక్కన్నపేట జడ్పీటీసీ భూక్య మంగ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మజ్జిగ మోలి, హుస్నాబాద్ ఎంపీపీ మానస, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజని తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అనిత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కౌన్సిలర్ అశోక్ బాబు, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్య, సర్పంచులు అశోక్ రెడ్డి, రాజేశం, తిరుపతి, గద్దల రమేష్, నాయకులు యాస శ్రీనివాస్ రమేష్ నాయక్, సంపత్, బైరగాని శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పాఠశాలలు సిద్ధం

నవతెలంగాణ-మర్కూక్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలో 8 పాఠశాలలు ఎంపికై యాయి. సోమవారం మండలంలోని చేబర్తి ప్రాథమిక పాఠశాల, వర్దరాజ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు రంగులు, ముత్రశాలలు, బోర్డులు, బెంచీలు, మంచి నీటి సౌకర్యం, విద్యుత్, వంట గది, వివిధ మౌలిక సదుపాయాలు కల్పించారు.



కర్ణాటక మంత్రిని సన్మానించిన మహమ్మద్ తన్వీర్

నవతెలంగాణ-జహీరాబాద్

కర్ణాటక రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళుతున్న వారికి జహీరాబాద్ పట్టణంలోని జేజే కళ్యాణమండపంలో సోమవారం కర్ణాటక మంత్రి రహీం ఖాన్ వీడ్కోలు పలికారు. సోమవారం ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు మహమ్మద్ తన్వీర్, ఆయన బృందం కలసి రహీమ్ ఖాన్‌ను ఘనంగా సన్మానించారు.



జహంగీర్‌ను పరామర్శించిన ఎర్రోళ్ల శ్రీనివాస్

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని వార్డ్ 3కి చెందిన తాజా మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ తల్లి ఫయిదా బేగం (70) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. కాగా ఆదివారం రాత్రి అంతక్రియలు జరగ్గా ఎమ్మెల్యే మాణిక్యరావు, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు మహమ్మద్ తన్వీర్, టీపీసీసీ నాయకులు వై నరోత్తం, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాజీ మున్సిపల్ చైర్మన్ గుప్తా అల్లాడి నర్సింలు మురళీకృష్ణ గౌడ్ ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి , రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్, మాజీ ఎంపీపీ విజయకుమార్ , తాజా మాజీ కౌన్సిలర్లు మోతీరాం రాములు నేత అబ్దుల్లా నారాయణరెడ్డి శేఖర్ తహెరా బేగం వివిధ పార్టీల నాయకులు బాబి మహమ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు. రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ సోమవారం జహంగీర్‌ను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజి సందీప్, బాల్రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



నేడు తెలంగాణ విద్యా దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు జిల్లా వ్యాప్తంగా విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో గల అన్ని విద్యాసంస్థల్లో ఉదయం జాతీయ పతాక వందనం చేసి, తదనంతరం సభలో విద్యారంగంలో తెలంగాణ సాధించిన విజయాలను వివరిస్తారన్నారు. జిల్లాలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మన ఊరు మనబడి పాఠశాలలను ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు పంపిణీ చేస్తారని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావా అందించే కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు. విద్యా దినోత్సవ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా గ్రామ, పట్టణ ప్రజలు, ఎస్ఎంసి ప్రతినిధులు, పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మన ఊరు- మన బడి లాంటి కార్యక్రమంతో ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోనీ అర్బన్ కాలనీ, బీ.సీ కాలనీలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల నూతన భవనాలను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదన్నారు. అనంతరం ఎమ్మెల్యేని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కొలను రాజా బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అంతిరెడ్డిగారి అనిల్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర సీని యర్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేంద్ర కుమార్, పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు వి.హనుమంత్ రెడ్డి , కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య ఉపాధ్యాయులు శేశిధర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



'లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ'కు అవార్డుల పంట

నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రార్థించే పెదవులకన్న సాయం చేసే పెదవులు మిన్న అన్ని నానుడిని అమలు చేయడమే ధ్యేయంగా పని చేస్తున్న 'లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ'కు జిల్లా లయన్స్ 320డి అవార్డు పంపకంలో ఏడు అవార్డులు రావడం జరిగింది. కాగా ఇది తమమీద మరిన్ని భాద్యతలను పెంచిందని, ఆ దిశగా 2023-24లయనిక్ సంవత్సంలో అనేక సేవాకార్యక్రమాలను నిర్వహిస్తామని లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ లయన్ శంకరి విజయెందర్ రెడ్డి అన్నారు. 2022-24 లయన్స్ సంవత్సరానికి గాను 320 డి కనెక్ట్ డిస్టిక్ అవార్డ్స్ కార్యక్ర మంలో డిస్టిక్ గవర్నర్ లయన్ గంధాని శ్రీ నివాస్(ఎం జె ఎఫ్) చేతుల మీదుగా అవార్డులను అందుకున్న సందర్భముగా విజయెం దర్ రెడ్డి మాట్లాడుతూ.. వైద్య, విద్యా వ్యవసాయ రంగాల్లో ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డు లయన్ లాడె మల్లేశం, ఉత్తమ సెక్రెటరీ అవార్డు లయన్ మంగళపర్తి వెంకటేశం, అవుట్ స్టాండింగ్ ట్రెజరర్ అవార్డు లయన్ దూడం రామచంద్రం.. జిల్లా గవర్నర్ గంధాని శ్రీనివాస్, మాజీ జిల్లాగవర్నర్ సూర్యరాజ్‌ల చేతులమీదుగా డిస్ట్రిక్ట్ చైర్మెన్‌లు శంకరి విజయెందర్ రెడ్డి, నాయికోటి రామప్ప, జోన్ చైర్మెన్ జి.వెంకన్న, సభ్యులు ఏ.లక్ష్మారెడ్డి అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఫస్ట్ వైస్ గవర్నర్ పి.లక్ష్మి , సెకండ్ వైస్ గవర్నర్ పంపాటి నగేశ్ తో పాటు లయన్ సభ్యులు యస్.రామప్ప,జోన్ చైర్మెన్ జి.వెంకన్న, సభ్యులు ఏ.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదర్శ క్లబ్‌కు అవార్డులు రావడం పట్ల డిస్ట్రిక్ట్ చైర్మన్‌లు లయన్ పి.రాములుగౌడ్, అనంతరావ్ కులకర్ణి, డి.హన్మంత్‌గౌడ్, లయన్ సభ్యులు అభినందించారు.



ప్రజల మన్ననలు పొందిన నాయకుడు దాసరి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్, మాజీ ఎంపీపీ కీర్తిశేషులు డి. లక్ష్మారెడ్డి మన్ననలు పొందిన నాయకుడని ఎమ్మెల్యే మాణిక్యరావు అన్నారు. సోమవారం దశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు మహమ్మద్ తన్వీర్ మాట్లాడుతూ.. తన తండ్రి లక్ష్మారెడ్డికి చాలా దగ్గరి సంబంధాలు ఉండేవని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు మహంకాళి శుభాష్, అల్లాడి నర్సింలు ,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్రజా ప్రతినిధులు పెంట రెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి , వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళ్లర్పించారు.



ప్రభుత్వ రోడ్డుపై అక్రమ పార్కింగ్

నీకోమాక్ పరిశ్రమ తీరుపై మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

నీకోమాక్ అనే కంపెనీ ప్రభుత్వ రోడ్డును పార్కింగ్ స్థలంగా వాడుతున్నదని.. వెంటనే ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సభ్యులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ రోడ్డును పార్కింగ్ కోసం కొన్నేండ్లగా అక్రమంగా వాడుతున్నదన్నారు. ప్రభుత్వ రోడ్డును కబ్జా చేయడం దుర్మార్గమన్నారు. రోడ్డుపైనే బైక్‌లు, కార్లు నిలుపుతుండడంతో మిగతా వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఈ విషయమై నికోమాక్ యజమాన్యాన్ని అడిగితే అడిగే వారిపైనే ఎదురుదాడి చేస్తున్నదని, బెదిరిస్తున్నదని ఆరోపించారు. వెంటనే సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని.. లేని యెడల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

హరిత తెలంగాణే సీఎం ధ్యేయం



నవతెలంగాణ-సదాశివపేట

పచ్చని చెట్లతో సస్యశ్యామలంగా విరాజిల్లుతున్న హరిత తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం సీఎం కేసీఆర్ ధ్యేయమని రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తంగడపల్లిలో సోమవారం నిర్వహించిన హరితోత్సవంలో చింతా ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. మండలంలో లక్షా యాభై వేల మొక్కలు నాటాలనే సీఎం కేసీఆర్ ఆదేశాలతో నేడు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నట్టు చెప్పారు. హరిత తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో గత తొమ్మిదేండ్లుగా సీఎం కేసీఆర్ హరితహారం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో గాని పొలాల వద్ద గాని తప్పకుండా మొక్కలు నాటాలని గ్రామస్తులకు సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు ఈ మొక్కలు నాటే కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు సర్పంచ్ గాండ్ల సరస్వతి సిద్దన్న, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున చింతా ప్రభాకర్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మడివాల స్వామి, ఎంపీపీ తొంట యాదమ్మ కిష్టయ్య, సీడీసీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మెన్ నరహరి రెడ్డి, సీడీసీ మాజీ చైర్మెన్ విజయేందర్ రెడ్డి, ఎంపీడీవో పూజ, పార్టీ మండలాధ్యక్షులు కార్యదర్శులు పెద్ద గోల ఆంజనేయులు, ఆరిఫొద్దీన్, ఎంపీఓ నారాయణ, ఐకేపీ నర్సింలు, సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి.. సంరక్షించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం తెలంగాణ హరితోత్సవం సందర్భంగా పట్టణంలోని అర్బన్ పార్క్‌లో మొక్కలు నాటి అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినందువల్లనే నేడు ప్రపంచ దేశాలు హైదరాబాద్ సిటీకి అవార్డు ఇచ్చాయన్నారు. నాడు నిజాం సర్కార్ అడవులకు ప్రాధాన్యత ఇచ్చి రోడ్ల వెంబడి చెట్లను నాటించడంతో వాహనాలు వదులుతున్న కాలుష్యాన్ని ఆ చెట్లు అక్కడికక్కడే పీల్చుకునేవన్నారు. నేడు ముఖ్య మంత్రి కేసీఆర్ కూడా హరితహారం కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతి పదికన చేపట్టి ప్రతి గ్రామంలో వార్డుల్లో చెట్లను పెంచే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. దీంతో వివిధ గ్రామాల సర్పంచులకు కార్యదర్శులకు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో అవార్డులు కూడా దక్కుతున్నాయన్నారు. అడవులను పెంచడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎన్నో గ్రామాల్లో అడవి జంతువులు అడవుల బాట పడుతున్నాయన్నారు. పట్టణాల పరిధి పెరగడంతో ప్రజల సంఖ్య, వాహనాల సంఖ్య సమానంగా పెరుగుతున్నందున మేజర్ గ్రామపంచాయతీలో, మండల కేంద్రాల్లో, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పార్కులను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలు సేద తీరేందుకు అన్ని విధాల ఏర్పాట్లను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ఇన్చార్జి అడిషనల్ డీఆర్డీఓ జయదేవ, డీఎఫ్ఓ శ్రీధర్‌రావు, సీనియర్ నాయకులు అడ్వకేట్ పాండు రంగా రెడ్డి, తుంకుంట సర్పంచ్ రాజు, న్యాల్కల్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు నర్సింహ రెడ్డి, ఇజ్రాయేల్ బాబీ, అధికారులు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాధికారెడ్డి, ఫారెస్ట్ అధికారులు ఎం.దుర్గయ్య, బాలకృష్ణ, రాజు, భాస్కర్, సంజు, వినాయక, ఉష ,వనజ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన బడితో విప్లవాత్మక మార్పులు



నవతెలంగాణ-అమీన్‌పూర్


ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మన ఊరు-మన బడి ప్రారంభించారని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం బీరంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.14 లక్షల 50 వేల మన ఊరు మనబడి పథకం నిధులతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మన ఊరు మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏడు వేల కోట్లతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో 55 పాఠశాలలను ఎంపిక చేసి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానంగా నీటి సౌకర్యంతో కూడిన టాయిలెట్లు, విద్యుదీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బందికి సరిపడే ఫర్నిచర్, పాఠశాల మొత్తం పెయి ంటింగ్ , గ్రీన్ చాక్ బోర్డులు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, శిథిలమైన గదుల స్థానంలో కొత్త క్లాస్ రూంలు, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయడం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండు రంగారెడ్డి, వైస్ చైర్మెన్ నరసింహ గౌడ్, మండల విద్యాధికారి రాథోడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, విద్యాధికారులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

గీతమ్ పీఎఫ్ఎంఏ వర్క్ షాప్ ప్రారంభం

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఫిజిక్స్ ఆఫ్ ఫ్లూయిడ్స్: మెథడ్స్ అండ్ అప్లికేషన్స్' (పీఎఫ్ఎంఏ-పార్ట్ 4) మూడు రోజుల కార్యశాలను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఐటీ ఖరగ్ పూర్ లోని ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ పూర్వ డీన్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఈ కార్యశాల నిర్వహణ ముఖ్యోద్దేశాన్ని వివరించారు. ఇందులో భాగంగా, తాము కొన్ని అధునాతన సాంకేతికతలను సదస్యులకు పరిచయం చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. మెరుగైన సింథటిక్ పద్ధతులు, సాంకేతిక రచన, పత్ర సమర్పణ మెళకువలను కూడా నేర్పిస్తామన్నారు. ఈ పీఎఫ్ఎంఏ పార్ట్-4 కార్యశాల ఈ సిరీస్ లో చివరిదని, దీనిని సదస్యులంతా సద్వినియోగం చేసుకుని, సొంతంగా ప్రయోగాలు చేయమని ప్రోత్సహించారు. ఎన్నో కష్టనష్టాలు, కరోనా వంటి మహమ్మారి నేపథ్యంలో కూడా వరుసగా నాలుగు కార్యశాలలను నిర్వహించిన గీతం గణిత శాస్త్ర విభాగం అధ్యాపకులను ప్రశంసించారు.తొలుత, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మాతహర్ రెజా సభకు స్వాగతం పలికి, దాని లక్ష్యాలను వివరించారు. చివరిగా వందన సమర్పణ చేశారు. వర్క్‌షాప్ ఇతివృత్తాన్ని ప్రొఫెసర్ కె.మారుతీప్రసాద్ వివరిస్తూ, గత నాలుగేళ్లగా ఈ కార్యశాలను ప్రతియేటా నిర్వహి స్తున్నట్టు చెప్పారు.కార్యశాల నిర్వాహకుడు ప్రొఫెసర్ నార్ల వంశీ కృష్ణ మాట్లాడుతూ.. తాము విధానాలు, పత్ర సమ ర్పణ మెళకువలు, దానిపై వచ్చిన వ్యాఖ్యలను సమీక్షించడం అనే రెండు అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్టు తెలి పారు. ఈ సిరీస్ లో చివరిదైన ఈ మూడు రోజుల కార్యశాలలలో చురుకుగా పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రారంభోత్సవంలో వివిధ ఇంజనీ రింగ్ కళాశాలల నుంచి దాదాపు 50 మంది ప్రతిని ధులు పాల్గొన్నారు. బుధవారం వరకు ఈ వర్క్‌షాప్ కొనసాగనున్నది.

అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్ చెరు పారిశ్రామికవాడలో అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పటాన్ నియోజక వర్గంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకోని ఏండ్లు గడుస్తున్నా.. సమస్య పెండింగ్‌లో వుందన్నారు. మండలంలోని ముత్తంగి, ఇస్నాపూర్, రుద్రారం, చిట్కుల్, ఇంద్రేశం ఇతర గ్రామాల్లో ఎంతోమంది డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కొల్లూరు, అమీన్‌పూర్ ఘనపూర్ చౌరస్తా, పోచారం గ్రామ పంచాయతీల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారన్నారు.ఈ ప్రాంతాల్లో మొదటగా నియోజక వర్గ ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం వుండి, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.3లక్షల చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళన చేసామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధర్,విష్ణు, నర్సింగరావు, అశోక్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మున్సిపల్ చైర్ పర్సన్



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి సోమవారం మున్సిపల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో, జోగిపేట రోడ్ లో 2500 మొక్కలు నాటామన్నారు. ప్రతి ఒక్కరూ హరి తహారంలో భాగస్వామ్యం కావాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లత విజేందర్ రెడ్డి, కమీషనర్ చంద్ర శేఖర్, డిప్యూటీ ఈఈ ఇంతియాజ్ అహ్మద్, ఏ ఈ శ్రీకాంత్, ఆర్ఓ విజయలక్ష్మీ, ఆర్ఐ సూర్య ప్రకాష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనంలో దేశంలోనే తెలంగాణ నెం.1

- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్
- రూ. కోటితో నిర్మించిన సింథటిక్ వాకింగ్ ట్రాక్ ప్రారంభం

నవతెలంగాణ-జోగిపేట

పచ్చదనంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా స్థానిక హై స్కూల్ గ్రౌండ్ లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన పదేండ్లలో పచ్చదనానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతీయే డు హరితహారంలో కోట్లాది మొక్కలను నాటి వాటిని సంరక్షించడం జరుగుతున్నదన్నారు. పల్లె ప్రగతి పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు నాటాలానే లక్ష్యాన్ని కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రీన్ జోగిపేటగా మార్చేందుకు పట్టణ ప్రధాన డివైడర్లపై మొక్కలు నాటడం జరిగిందని, జోగిపేట పట్టణమంతా పచ్చదనంతో కూడుకుందన్నారు.



రూ.కోటితో నిర్మించిన సింథటిక్ వాకింగ్ ట్రాక్ ప్రారంభం..

రూపాయలు కోటితో నిర్మించిన సింథటిక్ వాకింగ్ ట్రాక్ను ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. క్రీడాకారులకు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ను ప్రతి ఒక్కరు ఉపయోగిం చుకోవాలన్నారు. పోటీలలో పాల్గొనేందుకు ఈ వాకింగ్ ట్రాక్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, అందోల్ ఎంపీపీ జోగు బాలయ్య, మునిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ ప్రవీణ్, కమిషనర్ తిరుపతి, జోగిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎం. మల్లికార్జున్, వార్డు కౌన్సిలర్ ధనలక్ష్మి అనిల్, డిఈ కృష్ణ మోహన్, ఏఈ విఠోబా, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు





నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రాణవాయువును అందించే పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని జహీరాబాద్ ఎమ్మెల్యే కె. మాణిక్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హుసెల్లి గ్రామ శివారులో హరితహారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ సుధారాణి వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఆయా శాఖల అధికారులు పాల్గొని హరితహారం మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డాక హరితహారం ద్వారా గ్రామాలన్నీ పచ్చని చెట్లతో కళకళలాడుతున్నాయన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టనేలేదన్నారు. మానవ మనుగడకు చెట్టే జీవనాధారం అని.. కాబట్టి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను, ప్రజా ప్రతినిధులను, అధికారులను సర్పంచ్ సుధారాణి వెంకట్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గంగ్వార్ చౌరస్తాలో సర్పంచ్ జయశ్రీ నిరంజన్ రెడ్డి పూలతో గార్డెన్ లాగా ఏర్పాటు చేసి.. ఎమ్మెల్యేకు స్వాగత పలికారు. అక్కడ ఎమ్మెల్యే మొక్క నాటి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, జెడ్పీటీసీ స్వప్న, సర్పంచులు సుధారాణి వెంక టరెడ్డి, ఏపీడీ జయదేవ్, ఇన్చార్జ్ తహసిల్దార్ మునిరోద్దీన్, ఎంపిడిఓ వెంకట్ రెడ్డి, రూరల్ సీఐ నోముల వెంకటేష్, ఎస్సై వినయ్ కుమార్, ఆయా అధికారులు రాఘవరావు, సాబేర్ హుస్సేన్, మారుతి రాథోడ్, నాగభూషణం, వివేక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, నాయకులు పాండురంగా రెడ్డి, ఉమేష్ పాటిల్, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్, పీటర్, గ్రామ మహిళలు తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-జిన్నారం

ఈనెల 22న పటాన్‌చెరు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయడానికి విచ్చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికి.. వారి పర్యటను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. జిన్నారంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నాయికోటి రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 22న సీఎం కేసీఆర్ పర్యటనను, సభను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం యావత్తు నేడు దశాబ్ది ఉత్సవాల సంబరాలను ఘనంగా జరుపుకుంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత జిన్నారం వెంకటేశం గౌడ్, గడ్డపోతారం గ్రామపంచాయతీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి, కొడకంచి, అండూర్, ఉట్ల, గ్రామాల సర్పంచులు శివరాజ్, ఆంజనేయులు, ఖదీర్, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డిగారి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, నరేష్, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి ,రామకృష్ణ గోకర్ శ్రీధర్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రోజువారి కూలి రూ.600 ఇవ్వాలి



నవతెలంగాణ-సదాశివపేట

ఉపాధి హామీ కూలీలకు రోజువారీగా రూ.600 కూలి ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సదాశివపేట మండలంలోని ఆత్మకూరు గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి జయరాజు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వీడాలన్నారు. ప్రతి వారం ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాలన్నారు. దేశంలో ఉపాధి హామీకి ప్రతీ సంవత్సరం బడ్జెట్లో కేటాయింపులు తగ్గిస్తున్నారని, సంవత్సరంలో 2 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ఉంటే తప్ప కూలీలకు సరైన కూలీ రాదన్నారు. కానీ ప్రభుత్వాలు మాత్రం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదన్నారు. డ్వాక్రా చిట్టీలు కట్టలేక, నిత్యవసర సరుకులు కొనలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని.. 15 రోజులలోపు కచ్చితంగా కూలీ డబ్బులు చెల్లింపు జరగాలన్నారు. ఉపాధి హామీ రక్షణకై, ఉపాధి హామీ చట్ట రక్షణలో భాగస్వాములవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) స్థానిక నాయకులు మహేష్, తదితర కూలీలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినపత్రం అందజేశారు. అనంతరం సాయిలు మాట్లాడుతూ.. ప్రతీ నిరుపేదకు డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టించి ఇస్తామని 2014 నుంచి ప్రభుత్వం చెబుతూనే ఉన్నదని.. కానీ నేటికీ ఈ హామీ అమలు కాలేదన్నారు. అక్కడక్కడ నూటికి 5 శాతం ఇచ్చారు తప్ప 95 శాతం నిరుపేదలందరికీ ఇవ్వలే దని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కూడా నిరుపేదలు లేకుండా చేస్తామని చెప్పి.. మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల మంజూరు చేసి అందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూంలు కట్టించి ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఖాళీ స్థలం ఉన్న వారికి మూడు లక్షలు ఇస్తానని చెప్పింది కానీ.. మూడు లక్షలు ఏ మూలకు సరిపోవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి విపరీతంగా ధరలు పెంచుతున్నాయన్నారు. ఐరన్, సిమెంటు, ఇటుక ఇలా అన్నింటి ధరలు పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు డబ్బులు బెడ్ రూమ్ ఇవ్వాలని, ఇల్లు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు కేంద్ర ప్రభుత్వం పరిరక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, మనీ, వాణి, విజయ, దుర్గమ్మ, మల్లమ్మ, మంగా తదితరులు పాల్గొన్నారు.




విగ్రహాల కోసం లక్షా ఏడు వేల విరాళం



నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారంలోని బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జ్ఞాన మందిరానికి కాంగ్రెస్ సీనియర్ నేత, కౌన్సిలర్ పుల్లగూర్ల లక్ష్మారెడ్డి బ్రహ్మంగారి విగ్రహం, గోవిందమాంబ విగ్రహం, ఈశ్వరి మాత, సిద్ధప్ప ఈ నాలుగు విగ్రహాలకు రూ.1,0,7000 విరాళంగా అందజేశారు. దీంతో వారి కుటుంబానికి ఆలయ కమిటీ వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బాధితులను పరామర్శించిన కత్తి కార్తీక



నవతెలంగాణ-నార్సింగి

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ నియోజకవర్గంలో తమ పర్యటనను ఏకధాటిగా కొనసాగిస్తున్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా నార్సింగి మండల కేంద్రంలో పలువురిని కలిశారు. బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సహాయం అందజేశారు. తుంట నరసమ్మ (65), గుర్రాల ఎల్లయ్య (62) ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు, అనారోగ్యంతో బాధపడుతున్న ఇమ్మడి నరసయ్యను పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. తాను తన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మండలానికి చెందిన కుమ్మరి రవీందర్, ఖుర్షీద్ ఖాన్, భీమగారి కిషన్, స్వామి, బిక్షపతి, కుమార్, రవి నియోజకవర్గానికి చెందిన ఏ.ఎం.సి మాజీ డైరెక్టర్ ప్రభాకర్ చారి, టీపీసీసీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్నూల్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ దుబ్బాక బ్లాక్ అధ్యక్షుడు కొత్త దేవిరెడ్డి, ఐరేని సాయి తేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-చిలిపిచేడ్

బాల్య వివాహాలపై కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం చిట్కుల్‌లో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ సెంటర్ ఫర్ ఆక్షన్ రిసోర్స్ పీపుల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సక్రుబాయి, కోయిపల్లి మండలం ఆర్గనైజర్ మమతలు విద్యార్థులు, తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సక్రుబాయి, మమతలు మాట్లాడుతూ చిన్నతనంలోనే బాల్య వివాహాలు చేయవద్దని, 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే అమ్మాయిలకు వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు, చట్టాల గురించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఇన్చార్జి ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్



నవతెలంగాణ-మెదక్ రూరల్

జిల్లాలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కోరారు. చేశారు. విద్య హక్కు చట్టాన్ని, జీవో నెంబర్ 1ను అమలు చేయని ప్రైవేట్, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ఎంఈఓల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇష్ట రాజ్యాంగ ప్రైవేట్ స్కూల్స్ నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో డిఇఓ రాధా కిషన్‌కు సోమవారం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రవేట్ స్కూల్స్ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్, బుక్స్, స్పోర్ట్స్, టై లు స్కూల్లోనే అమ్ముతున్నారన్నారు. ప్రైవేట్ స్కూళ్ళు పుట్టగొడుగుల వెలుస్తున్నప్పటికీ పర్మిషన్ తీసుకున్నారా లేదా అని పర్యవేక్షణ చేయకుండా అధికారులు మాత్రం కుర్చీలకు అంకితమవుతున్నారన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆట స్థలాలు లేని ప్రైవేట్ స్కూల్స్ ఉన్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లాలో అన్ని ప్రైవేట్ స్కూళ్లలో పర్యవేక్షణ చేసి విరుద్ధంగా నడుస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రవేట్ స్కూళ్ల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు కూడా రుణాలు అందజేయాలి

ఎమ్మార్వో వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలో బీసీ రుణాలలో మున్నూరు కాపులకు కూడా రుణాలను అందజేయాలని సోమవారం మున్నూరు కాపు సంఘం సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులు 40 లక్షల మందికి పైగా ఉన్నారని రాష్ట్రంలో మున్నూరు కాపులందరూ పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్నూరు కాపులు కూడా రుణాలు అందజేయాలన్నారు. అదేవిధంగా కోకాపేటలో మున్నూరు కాపు సంఘానికి ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమికి ఐదు కోట్ల నిధులు సరిపోవడం లేదని ప్రభుత్వం మరో ఐదు కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, మున్నూరు కాపు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేశెట్టి లింగం, జిల్లా సలహాదారులు నర్సింలు, మండల ప్రధాన కార్యదర్శి నాయిని వెంకటేశం, నాయిని మహేష్, లక్ష్మణ్, తాడెం తిరుపతి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్చగా మట్టి అక్రమ రవాణా

చర్యలు తీసుకుంటామన్న ఇరిగేషన్ ఏఈ కవిత



నవతెలంగాణ-వెల్దుర్తి

యదేచ్చగా మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ కవిత హెచ్చరించారు. గత వారం రోజుల నుంచి ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాల పరిసరాల్లో ఉన్న చెరువు కుంటల నుంచి యదేచ్చగా మట్టిని తరలిస్తున్నారని, ఈ విషయం స్థానిక రెవెన్యూ సిబ్బంది దృష్టికి వచ్చినా అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయకట్టు దారులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులకు బానిసై అటువైపు కూడా రావడంలేదంటున్నారు. కొంతమంది అడ్డగించి ఎందుకు తరలిస్తున్నారని నిలదీస్తే మీకెందుకు పొమ్మని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ కవిత మట్టిని తరలిస్తున్న ప్రదేశానికి వెళ్లి పరిశీలించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు

బీసీలకు లక్ష సాయం నిరంతర ప్రక్రియ

ప్రతి నెల దరఖాస్తు చేసుకోవచ్చు : న్యాయవాది రాజేష్



నవతెలంగాణ-నార్సింగి

జూన్ 9న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం నిరంతర ప్రక్రియ అని మాజీ టెలికాం బోర్డు మెంబర్, న్యాయవాది, బీ.ఆర్.ఎస్ నాయకుడు అంచనూరి రాజేష్ తెలిపారు. నార్సింగి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి దఫా కావడం వలన 20వ తేది వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. అనంతరం ప్రతీ నెలా 5వ తేదీ వరకు గ్రౌండింగ్, 15వ తేదీ వరకు సాయం అందజేస్తారన్నారు. అర్హుడైన ప్రతీ బీసీ వ్యక్తికి చేరే వరకు పథకం కొనసాగుతుందని ఆర్థిక మంత్రి హరీష్ రావు, బీసీ శాఖా మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించారన్నారు. ప్రతి నెల దరఖాస్తులు చేసుకోవచ్చని, బీసీలు ఈ విషయం గమనించాలని ఆయన కోరారు. దరఖాస్తులు ఆన్లైన్ ప్రక్రియలో మాత్రమే చేయాలని, ఎలాంటి కార్యాలయాల్లో దరఖాస్తు చేయకూడదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మంత్రి హరీష్ రావు ప్రకటన చేశారన్నారు. అర్హులైన బీసీ లందరికీ ఈ పథకం చేరుతుందని, బీసీలో 14 కులాలకు, ఎంబీసీ లో 10 కులాలకు ఈ పథకం వర్తిస్తుందని, మిగతా కులాల వారికి వర్తించదన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ప్రజలు భయ పడాల్సిన అవసరం లేదని, దుబ్బాక నియోజక వర్గం లోని లబ్ధి దారులకు మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిలు ఈ సాయాన్ని అందజేస్తారన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ లో ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపీపీ క్యాంప్ కార్యాలయం ముందు కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్, రవీందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గుప్తా, సురేష్ నాయక్, అశోక్, ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు అశోక్ గౌడ్, ఉన్నారు.

మంత్రాల నెపంతో వ్యక్తిపై దాడి, గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్

మంత్రాలు చేస్తున్నారనే నెపంతో దాడి చేయగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మెదక్ పట్టణంలోని ఒకటో వార్డు ఔరంగాబాద్‌లో సోమవారం మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఈ నెల పదో తేదీన సంగెపు దమ్మయ్య (60)పై కొంత మంది దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రగాయాలకు గురైన దమ్మయ్యను చికిత్స నిమిత్తం 108లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దమ్మయ్య సోమవారం మృతి చెందాడు. మృతుని సోదరుని కుమారుడు సంగేపు భూమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శేఖర్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

24 శాతం ఉన్న అటవీ సంపదను 33 హరితహారం ద్వారా శాతానికి పెంపు

జెడ్పీ చైర్ పర్సన్ రేఖల హేమలత శేఖర్ గౌడ్









నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రంలో 24 శాతం ఉన్న అటవీ సంపదను 33 శాతానికి పెంచారని జెడ్పీ చైర్ పర్సన్ రేఖల హేమలత శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని దండుపల్లి గ్రామంలో హరితోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా అటవీ సంపదను కొల్లగొట్టారని దాంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడిందన్నారు. సకాలంలో వర్షాలు లేక రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అటవీ సంపాదన పెంచాలనే లక్ష్యంతో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి గ్రామ గ్రామాన పల్లె ప్రకృతి వనాలు నర్సరీలు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. అటవీ సంపద పెరగడంతోనే రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయని, రైతులు ఆనందంగా ఉన్నట్టు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో రాష్ట్ర సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అలాగే జెడ్పీ చైర్ పర్సన్ దత్తత గ్రామం గౌతోజిగూడలో సర్పంచ్ వెంకటేశ్వర్లు ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణు కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో మనోహరాబాద్ ఎస్సై సందీప్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని సూచించారు. మొక్కలు నాటడంతో సరిపోదని వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రజలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి రెడ్డి దండుపల్లి సర్పంచ్ పంజలక్ష్మి రాష్ట్ర నాయకులు పురం రవి ముదిరాజ్ అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ చంద్రశేఖర్ వైస్ ఎంపీపీ యంజాల విట్టల్ రెడ్డి నాయకులు పొట్టోల వెంకట్ గౌడ్ నాయకులు పంజా బిక్షపతి ఉపసర్పంచ్ మహేందర్ గౌడ్ ఏపీవో ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

గ్రామ గ్రామాన ఉద్యమంలా హరితహారం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో సోమవారం తెలంగాణ హరితోత్సవం కార్యక్రమాన్ని తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో నాయకులు సర్పంచులు అధికారులు ఒక ఉద్యమంలా చేపట్టారు. ఉదయం గ్రామాలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టారు. కోనాయిపల్లి పీటీలో రాష్ట్ర నాయకులు భాషా బోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మనిషి మనుగడకు ముఖ్యమైన చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కలను ప్రజలు దత్తత తీసుకొని మరి నీటిని పోసి రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు, అధికారులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి మాసాయిపేట వెల్దుర్తి మండలాల్లో ఉన్న అన్ని గ్రామపంచాయతీలో హరితోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళపర్తి గ్రామ పరిసరాల్లో ఉన్న అడవి పరిసరాల్లో అటవీశాఖ అధికారులతో ఎంపీపీ స్వరూప నరేందర్ రెడ్డి జెడ్పిటిసి రమేష్ గౌడ్ స్థానిక సర్పంచి రామకృష్ణారావు ఆధ్వర్యంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో సంపద వనం ఏర్పాటు చేశారు. ఇందులో అటవీ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులు పలు శాఖల అధికారులు మొక్కలు నాటారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలోని సంపద వనములు వివిధ రకాల మొక్కలు నాటామని ఎంపీడీవో వెంకటలక్ష్మి తెలిపారు. రాబోయే తరానికి వన్యప్రాణులకు ఉపయోగపడే విధంగా మొక్కలు నాటడం జరిగిందన్నారు. చెట్లతోటే మానవ మనుగడ ముడిపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి విగ్నేశ్వర్ ఏపీవో రాజు పంచాయత్ కార్యదర్శి దావీద్ ఫారెస్టు సెక్షన్ అధికారి కిరణ్ కుమార్, రవిమార్ కరీముద్దీన్ బీట్ అధికారులు భరత్, శోభ, రాణి, మానస, ఐకెపి సీసీ శ్రీనివాస్ గౌడ్ ఇరిగేషన్ ఏఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేగుంట

మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ప్రత్యేక అధికారి జయరాజ్‌లు అన్నారు. చేగుంట మండలం పోలంపల్లి శివారు అర్బన్ పార్కులో సోమవారం దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 19వ రోజు అర్బన్ పార్కులో రామాయంపేట రేంజ్ ఆటవీశాఖ అధికారులు ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు ప్రజాప్రతినిధులను శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతున్నామని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, చెట్లను నాటి పర్యావరణాన్ని రక్షించాలని, చక్కటి వర్షాలు కూడా కురుస్తాయని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మంచి కట్ల శ్రీనివాస్, ఎంపీడీవో ఆనందమేరి, ఎంపిటిసి అయిత వెంకటలక్ష్మి రఘురాం, భక్కి లక్ష్మీ రమేష్, పోలంపల్లి సర్పంచ్ నిర్మల సత్యం, ఫారెస్ట్ అధికారి నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

మానవ మనగడకు ప్రాణం మొక్కలు



నవతెలంగాణ-మెదక్ రూరల్

మానవ మనగడకు ప్రాణం మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నూతన కలెక్టరేట్ సముదాయంలో చేపట్టిన హరితోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా అటవీ శాఖాధికారి రవి ప్రసాద్, మునిసిపల్ చైర్మన్ చంద్రపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి తదితరులతో కలిసి పెద్ద ఎత్తున మాస్ ప్లాంటేషన్‌లో పాల్గొని మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆ శాఖముద్రించిన హరితహారం విజయాలు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాణం పోసేది మొక్కలని, మొక్కలు నాటడం కూడా అభివృద్ధిలో భాగమని ప్రగతికి సోపానమని అన్నారు. రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునీత లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రణాళికాబద్ధంగా హరితా హారం కార్యక్రమం చేపట్టారన్నారు. నర్సాపూర్ శాసనసభ్యులు మదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి సిద్ధిపేటలో ఒకే రోజు 10 వేల మొక్కలు నాటి పచ్చదనానికి ఇస్తున్న ప్రాముఖ్యతను వివరించారన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టి భాగస్వామ్యం వల్ల పచ్చదనాన్ని పెంపొందించుకున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి డాన్స్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ జానకి రామ్ సాగర్,జిల్లా అధికారులు శ్రీనివాస్, రాధాకిషన్, రాజిరెడ్డి, శంకర్, విజయశేఖర్ రెడ్డి, విజయలక్ష్మి, సుధాకర్, మెప్మా పిడి ఇందిర, డిసిట కరుణ, వ్యవసాయాధికారి ఆశాకుమారి, ఎంపిపి యమున, కో అప్షన్ సభ్యులు మన్సూర్, కౌన్సిలర్లు, విద్యార్థినిలు , అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, మదన్ రెడ్డి
మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత రెడ్డిలు సూచించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నర్సాపూర్ పట్టణ సమీపంలోని అర్బన్ పార్కులో అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించగా. ముఖ్య అతిథులుగా మెదక్ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై జిల్లా కలెక్టర్ రాజర్షిషా ,అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన హరితహారం పథకం కృషితో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, శివంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ లు రాజుయాదవ్, వెంకట్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గౌరి వెంకట్ రెడ్డి, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భోగచంద్రశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి రవి ప్రసాద్,, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అంబర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీముద్దీన్, నాయకులు పంబల బిక్షపతి ,కుమ్మరి నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో సోమవారం లేబర్ కార్డు దారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కామన్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నార్సింగిలో మొత్తం 183 మంది కార్డుదారులు ఉండగా 55 మంది పరీక్షలు చేయించు కున్నారు. ఈ సందర్భంగా కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బంది మాట్లాడుతూ లేబర్ కార్డు వల్ల చాలా ఉపయోగాలున్నాయని, కార్డు లేని వారు మీసేవ ద్వారాగాని స్థానిక లేబర్ కార్యాలయంలోగాని ఈ కార్డులను పొందాలన్నారు. సోమవారం జరిపిన పరీక్షల రిపోర్టులు వచ్చే వారం అందిస్తామని, ఎవరికైనా పరీక్షలలో సమస్యలున్నాయని నిర్ధారణ జరిగితే పెద్ద ఆసుపత్రులలో వారికి చికిత్స చేయిస్తామన్నారు. కార్మికులు నిర్మాణ పనులు చేసేటప్పుడు కొన్ని సార్లు లోపలి గాయాలు కావడం, దుమ్ము ధూళి వల్ల ఇన్ఫెక్షన్లు కావడం వంటి సమస్యలు వస్తాయని, నిర్లక్ష్యం వల్ల ఇవి ప్రమాద స్థాయికి చేరుతాయని, తద్వారా వారి పని చేసే క్షమత తగ్గి పనులు చేయలేక పోవచ్చున్నారు. అలాంటప్పుడు కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. సరైన సమయంలో పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే చికిత్స చేయించుకుని నయం చేసుకోవచ్చన్నారు. ఈ పరీక్ష క్యాంపులు తరుచుగా జరుగుతాయని, ప్రజలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామన్ సర్వీస్ సెంటర్ సిబ్బంది ప్రసాద్ గౌడ్, నరేందర్, రాధిక, విష్ణు, కిరణ్ లు పాల్గొన్నారు.

పుష్పగిరి కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్/మనోహరాబాద్

వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలను చేయించుకోవాలని ప్రమాదాల నివారణకు సహకరించాలని తూప్రాన్ ఎస్‌హెచ్‌ఓ సురేష్ కుమార్ మనోహరాబాద్ ఎస్‌హెచ్‌ఓ సందీప్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ పురపాలక పరిధిలోగల తూప్రాన్ టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారుల సంస్థ ఆదేశాలమేరకు ఆజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జి. యం. ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, జి. యం. ఆర్ పోచంపల్లి ఎక్స్ప్రెస్ హైవే లిమిటెడ్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూప్రాన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సురేష్ కుమార్ మనోహరాబాద్ ఎస్ హెచ్ ఓ సందీప్ రెడ్డి ముఖ్య అతిథిలుగా విచ్చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని



ప్రారంభించారు. ఈ సందర్భంగా తూప్రాన్ మనోహరాబాద్ ఎస్‌హెచ్‌ఓలు సురేష్ కుమార్, సందీప్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారుల కంటి చూపు సరిగా లేకపోవడం వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, కాబట్టి ప్రతి వాహనదారుడు క్రమం తప్పకుండ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జి.యం.ఆర్ పోచంపల్లి హైవేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ అవగాహన లోపం కారణంగా చాలా మంది డ్రైవర్లు సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవడం విస్మరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎస్ హెచ్ ఓ సురేశ్ కుమార్, మనోహరబాద్ ఎస్ హెచ్ ఓ సిబ్బంది, జి. యం. ఆర్ పోచంపల్లి హైవేస్ సిబ్బంది పరందామన్, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, ప్రవీణ్, సతీష్ కుమార్ పట్నాయక్, పుష్పగిరి కంటి ఆసుపత్రి కోఆర్డినేటర్ వేణు మరియు సిబ్బంది, ఫౌండేషన్ ఇంచార్జ్ శ్రీనివాస్, టోల్ ప్లాజా సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

ఆలయాలకు పూర్వ వైభవం

కొత్తగా 2143 ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం అమలు
సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాలలోని ఆలయాలకు పునర్ వైభవం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా 2143 ఆలయాలలో దూప దీప నైవేద్యం పథకం అమలు చేయడానికి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ ఆలయాలన్నింటికీ ప్రతినెల ధూప దీప నైవేద్యం పథకం కింద పూజా కార్యక్రమాల కొరకు రూ.6000 అందజేస్తారు. ఈ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మెదక్ జిల్లాలోని 93 ఆలయాలు, మెదక్ నియోజకవర్గంలోని 49 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గంలోని 49 ఆలయాలను ధూప దీప నైవేద్యం పథకం కింద మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమమైన విద్యకు నిలయంగా మారిన నిజాంపేట హాస్టల్





నవతెలంగాణ-నిజాంపేట

నాణ్యమైన విద్యకు అనేక సౌకర్యాలకు నిజాంపేట షెడ్యూల్ కులాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, హాస్టల్ నిలయం గా మారింది. ఈ హాస్టల్లో చదివిన విద్యార్థులు విదేశాలలో స్థిరపడ్డారు. కొందరు ఇంజనీర్లను కూడా అందించిన చరిత్ర ఈ హాస్టల్‌కు ఉన్నదని చెప్పొచ్చు. ఈ హాస్టల్ స్థాపించి దాదాపు 40 సంవత్సరాలు అవుతున్నది. అప్పట్లో చేగుంట, రామయంపేట, దౌల్తాబాద్, చిన్న శంకరంపేట్, దుబ్బాక మండలాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేవారు. నిజాంపేట హాస్టల్ విద్యార్థుల క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నది. హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. 3 నుంచి 9వ తరగతి వరకు తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం ఉన్నాయన్నారు. విద్యార్థులకు వసతి గృహంలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు. అహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు విశాలమైన గదులు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించబడతాయని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడునున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం స్లిప్ టెస్టు నిర్వహించబడుతుందన్నారు. వసతి గృహంలో లైబ్రరీ సదుపాయం ఉందన్నారు. విద్యార్థికి ఉచితంగా నోట్ బుక్స్ ,బెడ్ షీటు ,కార్పెట్, టవల్స్ బ్లాంకెట్ ,4 జతల బట్టలు ,స్టీల్ గ్లాస్ ప్లేటు ,స్కూల్ బ్యాగులు ,బూట్లు, సాక్స్ , స్వెటర్, మంకీ క్యాప్, స్టడీ చైర్స్ ఇవ్వబడతాయని తెలిపారు. ఆట వస్తువులు జిమ్ సౌకర్యం కూడా ఉందన్నారు. ప్రతినెల ప్రభుత్వ డాక్టర్ చేత వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి సంవత్సరం విజ్ఞాన విహారయాత్రలకు తీసుకువెళ్లామన్నారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహార భోజనము మెనూ ప్రకారం అందిస్తున్నామన్నారు. హాస్టల్లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఆధార్ కార్డు కుల ధృవీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ పత్రము, జిరాక్స్ కాపీలు పాఠశాల బోనఫైడ్, 3 పాస్పోర్టు సైజు ఫోటోలతో రావాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం నిజాంపేట హాస్టల్ ఎంతో దోహదపడుతుందన్నారు

నార్సింగిలో హరితోత్సవం



నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో హరితోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్ అధ్యక్షత వహించగా నార్సింగి ఎస్సై నర్సింలు, అటవీ అధికారి గబ్బర్ సింగ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో చెట్ల పెంపకంపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణను హరిత రాష్ట్రంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, హరితహారం పేరుతో దేశంలోనే ఆదర్శంగా ప్రతి సంవత్సరం కోట్లాది మొక్కలను పెంచుతున్నారన్నారు. అటవీ శాఖ కృషి వల్ల రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. గ్రీన్ కవర్ పెంచడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, పచ్చదనంలో ఎన్నో అవార్డులు గెలుచుకున్నామన్నారు. ప్రజలు కూడా తమ వంతు కృషిగా చెట్లను పెంచి రాష్ట్రంలో పచ్చదనం పెంచడానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత శ్రీనివాస్‌తో పాటు నార్సింగి ఎస్.ఐ నర్సింలు, అటవీ అధికారి గబ్బర్ సింగ్, ప్రత్యేక అధికారిని అంజమ్మ, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ప్రజలు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ప్రజా ప్రతినిధులు



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సిద్దిపేట అర్బన్ మండలం ఏన్సాన్పల్లి, పొన్నాల, మిట్టపల్లి, ఎల్లుపల్లి, నాంచార్‌పల్లి, తడకపల్లి గ్రామాలలో సోమవారం హరిత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, వైస్ ఎంపీపీ ఎల్లం, ఆయా గ్రామాల సర్పంచ్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో లక్షల సంఖ్యలో మొక్కలు నాటి హరిత పర్యావరణాన్ని సాధించుకున్నామని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా పచ్చని తోరణాల లాగా చెట్లు దర్శనం ఇవ్వడం తెలంగాణ ప్రభుత్వం లోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు రవీందర్ గౌడ్, జయశ్రీ రమేష్, తస్నీరు రేణుక శ్రీనివాస్, అంబటి మంగ భాస్కర్, కొన్నే కల్పనా నర్సింలు, ఎంపీటీసీలు బోనాల రంగం, నాగుల స్రవంతి ప్రశాంత్, మమతా యాదగిరి, స్థానిక నాయకులు ఫయాజ్ పంచాయతీ కార్యదర్శులు బాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



నవ తెలంగాణ - సిద్దిపేట

అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వార్షికోత్సవాల పోస్టర్లను డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించామని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షులు పుల్లని వేణు అన్నారు. ఏఐఎస్‌బీ గత 72 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేపడుతూ, దేశవ్యాప్తంగా సోషలిజం, పీస్, ప్రోగ్రెస్ నినాదాలతో విద్యార్థులలో జాతీయ భావాలను పెంపొందించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై 72 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ప్రయాణాన్ని కొనసాగిస్తూ 73వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గడిపే సుజిత్, బక్కోనీ అజయ్, కాషామైన చరణ్, భార్గవ్, నవీన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి



నవ తెలంగాణ హుస్నాబాద్ రూరల్

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ చేయాలని హుస్నాబాద్ ఏసిపి సతీష్ అన్నారు. సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ ఏసిపి సతీష్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం, భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా అడ్మిషన్ అయిన విద్యార్థులందరికీ సోమవారం పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ప్రిన్సిపాల్ బానోతు రాజన్న అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్ అయిన విద్యార్థులు వర్జినల్ టి సి ఇచ్చి పాఠ్య పుస్తకాలు తీసుకెళ్లవలసిందిగా కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్, ఈటీ ఇంగ్లీష్ మరియు తెలుగు మీడియంలో విద్యార్థుల అడ్మిషన్ పొందుటకు ఇంకా అవకాశం కలదని తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వెంటనే అడ్మిషన్ పొంది ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలను మరియు స్కాలర్షిప్ సౌకర్యాన్ని వినియోగించుకొని ఉన్నత విద్యకై ముందు కదలవలని తెలిపారు.


మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



నవ తెలంగాణ- గజ్వేల్

మున్నూరు కాపు కార్పొరేషన్, మున్నూరు బంధు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. మున్నూరు కాపు గజ్వేల్ పట్టణ అధ్యక్షులు. చందా నర్సింలు, కొండాపోచమ్మ డైరెక్టర్. శ్రీనివాస్, కౌన్సిలర్ ఆల్వాల్ బాలేష్, కమిటీ మెంబెర్స్. నాయిని కృష, నాయిని వెంకటేష్, ఐలాపురం శ్రీనివాస్,ఆల్వాల్ బిక్షపతి, గుర్రపాగారి రాజులూ, ఆకుల చందు, నాయిని శ్రీనివాస్, బండ్ల వేణు, నాయిని పర్శరాములు,జంగపల్లి నర్సింలు, నాయిని సంతోష్, జయల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించినా మారని ప్రజల తీరు



నవతెలంగాణ-బెజ్జంకి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి వచ్చినా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై కళాజాత ప్రదర్శనలు చేసి అవగాహన కల్పించిన ప్రజల తీరు మారడం లేదు. ఆదివారం అమావాస్య కావడంతో మండల పరిధిలోని గాగిల్లపూర్ గ్రామంలోని పంచాయతీ కార్యలయం వద్ద, గ్రామంలోని రోడ్డుపై మరోచోట రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించిన అనవాళ్లు కన్పించడం కలకలం రేపింది. దీంతో క్షుద్ర పూజలను గమనించిన గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మరోసారి మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాల్సిన అవశ్యకత ఉందని పలువురు కోరుతున్నారు.

ఊరూరా హరిత వనోత్సవం



నవ తెలంగాణ రాయపోల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం హరిత వనోత్సవం సందర్భంగా గ్రామాలలో మొక్కలు నాటారు. కొత్తపల్లి గ్రామంలో ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, రాయపోల్ మండల కేంద్రంలో సర్పంచ్ మౌనిక రాజిరెడ్డి, రాంసాగర్ గ్రామంలో సర్పంచ్ సంధ్యారాణి గణేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ షబానాతో పాటు ఆయా గ్రామాలలో ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు పూర్తయి, పదవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా సీఎం కేసీఆర్ పిలుపుమేరకు హరితవనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, వార్డు సభ్యులు, అంగన్వాడి టీచరులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వడ్ల డబ్బులు రాలేదని అధికారులపై మండిపాటు

- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నంగునూరు



వడ్లు అమ్మి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. సోమవారం నంగునూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన నిర్వహించారు. వారం రోజుల్లో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని వ్యవసాయ అధికారి గీత, ఐకెపి ఏపీఎం ఆంజనేయులు సమాధానం ఇచ్చారు. మూడు సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీకి వస్తున్న శానిటేషన్ డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచులు తిప్పని రమేష్, సీత బాలయ్యలు రాజగోపాల్ పేట వైద్యాధికారి ప్రవీణ్‌ను నిలదీశారు. స్థానిక సర్పంచ్, ఏఎన్ఎం జాయింట్ అకౌంట్ లో గతంలో డబ్బులు పడేవి. డబ్బులు ఆయా గ్రామాలకు వచ్చినప్పటికీ యూసీ బిల్లులు అందజేస్తే ఎవరు రసీదు ఇచ్చారో వారు అకౌంట్లో డబ్బు జమ చేసేందుకు సాఫ్ట్ వేర్ మారిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని వైద్యాధికారి సమాధానం ఇచ్చారు. కంటి వెలుగు కార్యక్రమానికి వేళల్లో భోజనానికి ఖర్చు చేశామని కనీసం ప్రభుత్వం నుండి వచ్చే నిధులు రాకపోతే మేమేమి చేయాలని ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ అయిన తానే రూ. లక్ష ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం రెవిన్యూ సిబ్బంది జాప్యం చేస్తున్నారని కోనాయిపల్లి సర్పంచ్ వెంకటేశం సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తెలంగాణ ప్రభుత్వం విద్య కోసం లక్షల్లో ఖర్చు చేస్తున్న ప్రతి గ్రామం నుండి ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నారని ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు కలిసి నియంత్రణ చేస్తే సహకరిస్తామని మండల విద్యాధికారి దేశిరెడ్డి బదులిచ్చారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ నంగునూరు మండలంలోని ఘనపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించలేదని గ్రామ సర్పంచ్ బత్తుల రజిత సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. డీఎం దృష్టికి తీసుకువెళ్లి రెండు మూడు రోజుల్లో బస్సును పునరుద్ధరిస్తామని ఆర్టీసీ అధికారి ఏ. ఎస్ నారాయణ సమాధానం ఇచ్చారు. మిగతా శాఖ అధికారులు వారివారి నివేదిక చదివి వినిపించారు. ఈ సమావేశంలో జడ్పిటీసీ తడిసిన ఉమా, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్ణ కంటి రేణుక, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దిపడగ కిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, ఎంపీటీసీలు బెదురు తిరుపతి, కోల సునీత, మండల కోఆప్షన్ సభ్యులు ఎం.డి. రహీం, ఇంచార్జిఎంపీడీవో వేణుగోపాల్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ కార్యాలయాలు లంచగొండి కార్యాలయాలుగా తయారయ్యాయని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం కాంప్లెక్స్ వద్ద బీసీ కులాల సంబంధించిన కుల సర్టిఫికెట్లు, విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇతర పనుల కోసం వచ్చిన ప్రజల నుండి ఒక్కో దరఖాస్తుకు రూ.1500 తీసుకుంటున్నట్లు ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన బీసీ రుణాల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు కాసుల రూపంలో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇంత పెద్ద భవనం సీఎం కేసీఆర్ నిర్మించారని ఇది అవినీతి కాంప్లెక్స్‌గా తయారైందని ఆరోపించారు. రెవెన్యూ సిబ్బంది ఇతర శాఖ అధికారులు వివిధ పనుల కోసం వచ్చే లబ్దిదారులు, ప్రజలకు పైసలు ఇస్తేనే పని చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గంలో ఈ దుస్థితి ఉందని మండిపడ్డారు. ప్రజల కష్టాలు తెలుసుకోని ముఖ్యమంత్రి గజ్వేల్ ప్రజలకు అవసరం లేదన్నారు. మరో పక్క మల్లన్న సాగర్ నిర్వాసితులకు రావాల్సిన పూర్తిస్థాయి బెనిఫిట్స్ రాకుండా ప్రభుత్వం ఆపిందన్నారు. కొందరు అధికారులు దీన్ని కాసుల రూపంలో ఉపయోగించుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీరు మారకపోతే గజ్వేల్ ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. 32 సీసీ కెమెరాలు పెట్టి నిర్మించుకున్న మినీ సీఎం క్యాంప్ ఆఫీస్‌కు ఇప్పటివరకు రాకపోవడం గజ్వేల్ ప్రజలపై ముఖ్యమంత్రికి ఏ స్థాయి చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందన్నారు. రెవెన్యూ అధికారులు లబ్దిదారులను ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ బాలరాజుతో చర్చించి లబ్దిదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని, కార్యాలయంలో అవినీతి నిర్మూలించాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ప్రమోద్ కుమార్, కాంగ్రెస్ నేతలు నాయిని యాదగిరి, అంక్షారెడ్డి, రంగారెడ్డి, గుంటూకు శ్రీనివాస్, వహీద్ ఖాన్, విట్టల్, నరేందర్ రెడ్డి, మోహన్, మల్లేశం, నక్క రాములు, రాజు పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్ లో కొత్తరాతియుగం ఆనవాళ్లు





నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ గ్రామంలో, ఇసుక బావి పరిసర ప్రాంతంలోని ఒక వరుపుబండ మీద కొత్తరాతియుగం నాటి నూరుడు గుంటలను, ఒక రాతిగొడ్డలిని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు ప్రణయ్ కుమార్ సోమవారం గుర్తించారు. వరుపుబండ మీద 58 నూరుడు గుంటలు కనిపించాయి. ఇవన్నీ కొత్తరాతియుగం పురామానవుడు రాతిపనిముట్లను నూరి, పదునుపెట్టుకున్న రాతిగుంటలు. ఇక్కడే రాతితో చేసిన కొత్త రాతియుగపు చేతిగొడ్డలి లభించిందన్నారు. పరిసరాల్లో రెండువరుసల బంతిరాళ్లతో బృహత్ శిలా యుగపు సమాధులు వెలుగులోకి వచ్చాయి. ఈ ప్రాంతమంతటా మెగాలిథ్ సమాధులు, బండలపై నూరుడుగుంటలు, కొత్తరాతియుగపు రాతిపనిముట్లు విస్తారంగా లభిస్తున్నాయి అని తెలిపారు. పురావస్తుశాఖ తవ్వకాలు జరిపిన పుల్లూరు, దేవుని నర్మెటల మధ్య ప్రదేశం జగదేవ్‌పూర్. ఈ పరిసరాల్లో తిమ్మారెడ్డిపల్లెలో రాతిచిత్రాలను కూడా కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. సిద్దిపేట జిల్లాలో పలుచోట్ల పురామానవుల ఆవాసాలు, ఆనవాళ్ళు, రాతిపనిముట్లు, పెదరాతియుగం సమాధులను చరిత్ర బృందం వెలుగులోనికి తెచ్చింది. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు.

సమయానికి రాని అధికారులు



నవ తెలంగాణ మిరుదొడ్డి

సమయానికి రెవెన్యూ అధికారులు కార్యాలయానికి రాకపోవడంతో ఆగ్రహించిన ప్రజలు సోమవారం రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో నిర్వహించారు. సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి రోజు ల తరబడి తిరిగినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలోని తహసి ల్దార్ కార్యాలయం ఎదుట మండల ప్రజలు ఆందోళనకు దిగారు. 11 గంటలు దాటిన కార్యాలయానికి రెవెన్యూ అధికారులు ఎవరు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష రూపాయల రుణం కోసం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమకు అనుకూలమైన వారికి మాత్రమే సర్టిఫికెట్లు త్వరగా అప్రూవ్ చేస్తున్నారని, మిగతావారు కాళ్ల అరిగేలా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగేలా చేస్తున్నారని వాపోయారు. రెవెన్యూ కార్యాలయంలో కొందరు నేరుగా డబ్బులు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకో విరమింపజేశారు. విషయం తెలుసుకున్న ఆర్ ఐ బిక్షపతి కార్యాలయానికి రావడంతో ఒక్కసారిగా అక్కడున్న వారంతా ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. వెంటనే తాము దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చిన వారికే సర్టిఫికెట్లు ఇస్తే సహించేది లేదంటూ తేల్చి చెప్పారు. త్వరితగతిన సర్టిఫికెట్లు అందేలా చూస్తానని ఆర్ఐ బిక్షపతి హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- నంగునూరు

ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నంగునూరు మండల కేంద్రం, నర్మెట గ్రామాల్లో వేరువేరుగా నిర్వహించారు. నంగునూరు గ్రామ శాఖ అధ్యక్షుడు అనరాజు నాగరాజు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తప్పెట శంకర్ ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కార్యకర్తలు సైనికులు లాగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అచ్చిన సత్తయ్య, చెలికాని యాదగిరి యాదవ్, బాగు శ్రీకాంత్ యాదవ్, గౌరబోయిన సంపత్, రాగుల కృష్ణ, దాసరి కిషన్, దేవులపల్లి రాజు,ద్యాగల రాజు, గోనెపల్లి శివప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు రంగు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదగిరి, గంధముల యాదగిరి, నర్మెట గ్రామ అధ్యక్షు కొమ్మూరు రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు పొన్నాల గోపాల్ రెడ్డి, గట్టు కిరణ్, బంగారం నర్సింలు, బాందోజు శ్యామ్, సార్లపురం అజయ్, గుండెల్లి రాములు, మంకాల కనకయ్య, బండి రంజిత్ గౌడ్, జితేందర్, మహేష్ పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ - చిన్నకోడూరు

ఎన్నికల సమయంలో రైతులకు కల్లబొల్లి హామీలిచ్చి గద్దెనెక్కిన కెసిఆర్ సర్కార్ రైతులను మోసం చేస్తున్నారని, వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘము ఆధ్వర్యంలో చిన్నకోడూరు తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులూ మద్దతు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘము జిల్లా అధ్యక్షులు చల్ల తిరుపతి రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ తో కలిసి మాట్లాడుతూ... ముమ్మాటికీ బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని, కెసిఆర్ పాలనలో రైతులు మోసపోయారన్నారు. వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలనీ డిమాండ్ చేసారు. అంతే కాకుండా గత ప్రభుత్వాల మాదిరిగా సబ్సిడీలో పనిముట్లు, విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రంలో రైతు సంఘము మండల అధ్యక్షుడు నాక్కిరెడ్డి బల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసం మహేందర్ , కృష్ణారెడ్డి, బాలయ్య, పర్శరాంలు, జయంత్, ఎల్లయ్య, నర్సయ్య జగన్, శేషు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవ తెలంగాణ - సిద్దిపేట

మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రతి సంవత్సరం ఐదువేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అల్లం ఎల్లం, కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లా కేంద్రాలలో, ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణం కోసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి, రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయించాలనీ, కోకాపేటలో మున్నూరు కాపులకు ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల భూమి ఐదు కోట్ల రూపాయల నిధులు ఏ విధంగా సరిపోవటం లేదని జనాభా నిష్పత్తి ప్రకారం దానిని రెట్టింపు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల కిష్టయ్య, పోతుల రమేష్, ఆంజనేయులు, సందుల సతీష్ కుమార్, మరిపల్లి శంకర్, మాచవరం శ్రీనివాస్, హరిశంకర్, ఆకుల బాలయ్య, రాజయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

నవ తెలంగాణ కొండపాక

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జిదారుల నుండి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఎంతో ఆశతో కార్యలయంకి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యం అని జిల్లా అధికారులకు తెలిపారు. అర్జిదారుల నుండి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలి. అర్జిదారులకు ప్రజావాణి కార్యక్రమం పైన నమ్మకం పెరిగిందని క్రమక్రమంగా అర్జిదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహంతో పనిచేయ్యాలన్నారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు మరియు ఇతరత్రా మొత్తం కలపి 49 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు




ప్రయాణికులకు అందుబాటులో 100 టికెట్



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నూతన పథకం బస్ కండక్టర్ల దగ్గర టీ-9 టికెట్లను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ -ప్రెగ్నపూర్ డిపో మేనేజర్ బి. సురేఖ అన్నారు. సోమవారం టీ 9 టికెట్లపై ఆమె విలేకరులతో మాట్లాడారు. పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులలో కండక్టర్ దగ్గర రూ.100లు చెల్లించి టీ-9 టికెట్ తో 60 కి.మీ. పరిధిలో రానుపోను 120 కి.మీ. దూరం ప్రయాణించవచ్చన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులకు మరింత సేవలను విస్తృత పరిచేలా ప్రజల సౌకర్యార్థం కొరకు ఎండీ సజ్జనార్ మరో వినూత్న పథకం ప్రజల ఆదివారం నుండి టీ-9 టికెట్ కు శ్రీకారం చుట్టారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రయాణీకులకు ఆర్థిక భారం తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలకు, సీనియర్ సిటిజన్లకు కేవలం రూ.100ల టీ-9 టికెట్ తో ప్రతి రోజు పల్లె వెలుగు బస్సులలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రాను, పోను 120 కి.మీ. సురక్షితంగా ప్రయాణించవచ్చని డీఎం తెలిపారు. దీంతో ప్రయాణీకులకు రూ.20 నుండి రూ.40 వరకు ఆదా అవుతుందని ఆమె తెలిపారు. 60 ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లు మాత్రం వయస్సు ధృవీకరణ, ఆధార్ కార్డు బస్సు కండక్టర్ కు చూపించి టీ-9 టికెట్ పొందవచ్చన్నారు.సాయంత్రం 4 గంటల వరకు కండక్టర్లు టీ-9 టికెట్లు జారీ చేస్తారని ఆమె అన్నారు. ఒక లీటర్ పెట్రోల్ కంటే తక్కువైన రూ. 100ల టీ-9 ఆర్టీసీ టికెట్ తో రాను, పోను పల్లె వెలుగు బస్సులలో ఏకంగా 120 కి.మీలు హాయిగా, ఆనందంగా ప్రయాణించవచ్చన్నారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న ఈ నూతన సువర్ణ అవకాశాన్ని గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ డిపో పరిధి ప్రయాణీకులకు అందిపుచ్చుకోవాలని గజ్వేల్ -ప్రెజ్ఞాపూర్ డిపో డీఎం బి. సురేఖ గారు సూచించారు.అంతే కాకుండ స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణిలకు అందిస్తున్న మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9959226270.

పేదల నేస్తం కాంగ్రెస్ హస్తం



నవ తెలంగాణ- దుబ్బాక రూరల్

రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, కాంగ్రెస్ హస్తం అంటేనే పేదల నేస్తమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన "దుబ్బాక ఆత్మగౌరవ యాత్ర"లో భాగంగా 85 వ రోజైన సోమవారం నాడు దుబ్బాక మండల పరిధిలోని కమ్మర్ పల్లి గ్రామంలో పాదయాత్ర చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా తిరుగుతూ ప్రజలకు వివరించారు.ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎల్లమ్మ చెరువు కట్ట పనులు పూర్తి చేయాలని నిరసన



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్ట పనులు పూర్తి చేయాలని సోమవారం బిజెపి నాయకులు పట్టణంలోని నీటి పారుదల శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 7 సంవత్సరాలు గడుస్తున్నా మీని ట్యాంక్ బండ్ పనులు నత్తనడకన సాగుతున్నాయని వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అనంతరం నీటి పారుదల శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ మ్యాదరబోయిన వేణు యాదవ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రైతు సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం



నవతెలంగాణ-తొగుట

రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుగకు సాగుతున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య అన్నారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం గొప్ప విషయమని అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ పాలకవర్గంతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా వంటి కార్యక్రమాలు అమలు చేయడం సంతోషకరమన్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 15 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని 3710 మంది రైతుల దగ్గర నుంచి సేకరించినట్లు తెలిపారు. దాదాపు రూ.30 కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి, డైరెక్టర్ లు తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్వీ యూత్ ఆధ్వర్యంలో నోటు బుక్స్ పంపిణీ



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్వీ యూత్ ఆధ్వర్యంలో రూ.15 వేల విలువ గల నోట్ బుక్స్‌ను సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పేద కుటుంబాల నుంచి వచ్చినవారు ఉంటారని, విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేయడం సంతోషకరమని వెంకటాపూర్ గ్రామ బిఆర్ఎస్వీ యూత్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, జెడ్పిటిసి శ్రీహరి గౌడ్, సర్పంచ్ లక్ష్మి మల్లయ్య, ఎంపిటిసి ఎర్ర ఎల్లం, మాజీ సర్పంచ్ ముత్యాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్వీ యూత్ అధ్యక్షులు బండి శ్రీకాంత్, సభ్యులు బొల్గాం వెంకటేష్, దబ్బెట మహేష్, కుంచెం రమేష్, నాయకులు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

చౌదర్ పల్లిలో హరితోత్సవం



నవతెలంగాణ దుబ్బాక రూరల్

అక్బర్పేట్ భూంపల్లి మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో సోమవారం సర్పంచ్ ఆధ్వర్యంలో హరితోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద గ్రామ పంచాయతీ పాలకవర్గం,గ్రామస్తులతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. పంచాయతీ సెక్రెటరీ కిషన్, అంగన్వాడీ టీచర్ విజయ ,ఆశా వర్కర్ రమ్య, వివోఏ హైమావతి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు, గ్రామస్తులు,యువత ఉన్నారు

దుస్తులు, నోట్ పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాలను మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి సోమవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈసారి నోటు పుస్తకాలు కూడా అందజేయడం శుభ పరిణామం అన్నారు. నంగునూరు మండలంలో 10 జీపీఏ సాధించిన 18 విద్యార్థులకు మంత్రి హరీష్ రావుచే పదివేల నగదు బహుమతి అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్, ఉపాధ్యాయులు తిరుపతి,రాజమౌళి, రాజిరెడ్డి, సీఆర్పీలు పెంటయ్య, మోహన్ బాబు, రేణుక తదితరులు పాల్గొన్నారు.


బస్సు యాత్రను జయప్రదం చేయండి



నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కోసం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన సిద్దిపేట జిల్లాలో జరిగే రాష్ట్ర బస్సు యాత్రను జయప్రదం చేయా లని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలకు రూ.పది లక్షలు మంజూరు చేయాలన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదవారికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పి హామీలను విస్మరించాయన్నారు. ప్రభుత్వ స్థలాలలో ఇండ్లు నిర్మాణం చేసుకున్న పేదవారికి 150 గజాల స్థలాన్ని పట్టా చేసి ఇవ్వాలన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ ,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నవీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరవింద్ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో కొమురవెల్లి యాదయ్య, నరసవ్వల కూతురు సంగీత అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబ పరిస్థితి గురించి మాజీ ఎంపీపీ ద్వారా మంత్రి హరీష్ రావుకు తెలియజేశారు. మంత్రి ఆదేశాల మేరకు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి పంపించిన ఐదువేల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. గ్రామ సర్పంచ్ బెంద్రం కమలాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెల్లి రాజయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేశం,అరె సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవ తెలంగాణ కొండపాక

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని భారత జాగృతి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు అనంతుల ప్రశాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొండపాక గ్రామానికి చెందిన కుచ్చుల నరసింహులుకు మంజూరు అయిన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జంజరపు నర్సింలు స్వామి పాల్గొన్నారు.



ఐదో రోజుకు హర్టెక్స్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ఐడిఏబొల్లారంలోని హర్టెక్స్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు సోమవారానికి ఐదో రోజుకు చేరాయి. కాగా వారి దీక్షకు పిపిఎల్ యూనియన్ జనరల్ సెక్రెటరీ, వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు మద్దతు తెలిపి మాట్లాడారు. హర్టెక్స్ యజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతన ఒప్పందం వెంటనే చేయాలని, సస్పెండ్ చేసిన 12 మంది కార్మికులను విధిలోకి తీసుకోవాలని, లాకౌట్ పీరియడ్ వేతనాలు చెల్లించాలని వాళ్లు డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గంగారంలో హరితోత్సవం

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని గంగారం గ్రామంలో దశాబ్ది ఉత్సాహంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి మొక్కలు నాటించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆకుపచ్చ వైభవం.. సత్ఫలితాలు ఇస్తున్న హరితహారం కార్యక్రమం చాలా మంచిదన్నారు. అంతరించిపోతున్న అడవులకు పునర్జీవనం పోయడం, పలు ఔషధ మొక్కలను పెంచి ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని మార్చాలనే ఉద్దేశంతో హరితహారం ద్వారా తమ పాఠశాలలో మొక్కలు నాటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వీరప్ప, ఎంపీటీసీ కాంతయ్య, పంచాయతీ కార్యదర్శి మంజుల, ఏఎన్ఎం సరళ, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, పాఠశాల విద్యార్థులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



బాటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనురాధకు డాక్టరేట్

నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొర్పోల్ అనురాధ 'నీటివనరుల స్థితిగతులు, భౌతిక రసాయనిక విశ్లేషణ' అనే అంశం మీద సమర్థవంతమైన సిద్ధాంత వ్యాసం సమర్పించినందుకు ఉస్మానియా యూనివర్సిటీ వారు ఆమెకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేసారు. అనురాధకు గైడ్‌గా ప్రొఫెసర్ నిర్మలా బాబూ రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సోమవారం కళాశాలలో జరిగిన సభలో అనురాధను ఘనంగా సన్మానించారు. ఈ సభలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆమె పీహెచ్డీ కృషిని అభిన ందించారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరికీ అనురాధ ధన్యవాదాలు తెలిపింది.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు







నవతెలంగాణ-జహీరాబాద్

ఏఐసీసీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను డీసీసీబీ మాజీ చైర్మెన్ యం.జైపాల్ రెడ్డి, టీపీసీసీ నాయకులు వై.నరోత్తంలు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి, సర్పంచ్‌లు పాండురంగారెడ్డి, నవాజ్ రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు మైనోద్దీన్, మాజీ సర్పంచ్ శంకర్, మాజీ కౌన్సిలర్ సునీల్ కుమార్, రాజు స్వామి, రాజేశ్వర్, కార్తీక్ రెడ్డి, రాజు నాయక్, బస్వరాజ్, కొటేశ్వర్ స్వామి, కేశవరెడ్డి, నబిసాబ్, ప్రభాకర్, మోహన్, ప్రభు, మహ్మద్ మౌలానా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. నాయకులు ప్రదీప్ గౌడ్, ప్రవీ ణ్, హరికృష్ణ గౌడ్ శరత్ బాబు, సతీష్, రాజు, మధు, కృష్ణ, రాజశేఖర్, కాజా, అలి అబ్బాస్, అనిల్ కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కంగ్టి : కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన కంగ్టిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలి సుభాస్ చంద్రబోస్ చౌరస్తాలో కేక్ కట్ చేసి.. టపాకాయలు పేలుస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువ నాయకులు కాశి రాజు మాట్లాడుతూ.. రాహుల్ గాంధీది దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం అని కొనియాడారు. రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దామనాగన్న, బసిరెడ్డి, పట్నె సంతోష్, కుర్తె శ్రీనివాస్, లక్ష్మన్ నాయక్, రాజారం తాండ సర్పంచ్ పల్లవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలోని గాంధీనగర్‌కు చెందిన సుసాహిద్దీన్ అన్సారి అనారోగ్యాలతో బాధపడుతూ.. చికిత్సకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ వెంటనే స్పందించి రూ.10,000 సాయాన్ని ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు ద్వారా బాధితుడికి అందజేయించారు. దీంతో అన్సారి నీలం మధుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సాయం అందజేసినప్పుడు గంతి శంకర్, నరేన్, మచ్చ శీను, మైలారం శీను, మంకు రాజు, సోమాచారి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పటాన్ చెరు పట్టణంలోని ఆల్విన్ కాలనీ, మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఆల్విన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం, పచ్చదనం అందించాలన్న సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, ఎంపీడీవో బన్సీలాల్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువు అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-రామచంద్రాపురం:



రామచంద్రపురం డివిజన్‌లో ఉన్న 127 ఎకరాల రాయసముద్రం చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. సోమవారం జిహెచ్ఎంసి ఇరిగేషన్ ఏఈ పావని, ఇంజనీరింగ్ డీఈ నరేందర్, ఏఈ ప్రభు మరియు స్థానిక రామచంద్రారెడ్డి నగర్ కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ చెరువును సందర్శించారు. చెరువులో చుట్టుపక్కల కాలనీల వ్యర్థ జలాలు వచ్చి చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంట వెంటనే తొలగించాలన్నారు. అలాగే చెరువు కట్ట పైన మిగిలి ఉన్న సీసీ రోడ్ కూడా మంజూరు అయిందని త్వరలోనే రోడ్ పనులు ప్రారంభం అవుతుందన్నారు. చెరువు తూము వద్ద నుంచి వర్షపు నీరు సరిగ్గా వెళ్లక వర్షాకాలంలో లోతట్టు కాలనీ లు జలమయం అవుతునాయి అని తూము నుంచి నక్కవాగు వరకు బాక్స్ డ్రైన్ నిర్మించడానికి ప్రతిపాదన పూర్తి చేయాలని, బాక్స్ డ్రైన్ కొరకు మంత్రి కేటీఆర్ కి వినత పత్రం ఇవ్వడం జరిగింది అని కార్పొరేటర్ తెలిపారు. వారితో రామచంద్రారెడ్డి నగర్ కాలనీవాసులు నాగభూషణం, వాసుదేవ్, మధు, రమేష్, సహదేవ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రాములు, రాంచందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఉన్న రాంచంద్రారెడ్డి నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హరితహారం కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని, భావితరాల వారికీ అర్థవంతంగా ఉండాలని కార్పొరేటర్ కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పచ్చదనం పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి సూచించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో సోమవారం నిర్వహించిన హరితహార దినోత్సవంలో వారు పాల్గొని అధికారులు, కౌన్సిలర్లతో కలిసి ఖాళీ ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు నాటేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో అటవీ శాతం పెంచేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ద్వారా ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, కమిషనర్ రాజేంద్ర కుమార్, కౌన్సిలర్లు బీరప్ప యాదవ్, గోపాలమ్మ, చంద్రయ్య, స్థానిక నాయకులు చంద్రారెడ్డి, చక్రపాణి, వెంకటయ్య, అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరణిలో తొలగించిన రైతుల పేర్లను వెంటనే ఎక్కించాలి



నవతెలంగాణ-కొండాపూర్

గతంలో ఉన్న పట్టా పాసు బుక్కులను తొలగించి ధరణిలో పేరు తీసేయడంతో బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని.. వారి పేర్లను వెంటనే ధరణిలో ఎక్కించి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు బి.యాదవ రెడ్డి మాట్లాడుతూ.. మహందాపూర్ గ్రామంలో 22 సర్వే నంబర్ గల భూమిని గతంలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో పట్టా సర్టిఫికెట్లు రైతులకు ఇచ్చారన్నారు. అంతకంటే ముందున్న ప్రభుత్వాలు కూడా భూ పంపిణీలో భాగంగా సర్టిఫికెట్లు పాస్ పుస్తకాలు రైతులకు ఇచ్చారన్నారు. అయితే కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ ప్రక్షాళన పేరుతో ఇక్కడున్న రైతులకు పాస్ పుస్తకాలను నిలిపివేశారన్నారు. కాబట్టి సాగులో ఉన్న వారికి వెంటనే పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని.. లేని యెడల మండలంలో ఉన్న రైతులందరినీ ఏకం చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు కే.రాజయ్య, కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రామచందర్, సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్. బాబురావు, అంజయ్య, శీను, వ్యవసాయ కార్మిక సంఘం గోపాల్, నాయకులు, సంజీవులు, రైతులు అమృతమ్మ, శాంతమ్మ, ఏసమ్మ, మంజుల, యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో డ్రయినేజీ పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని 24వ వార్డ్ మల్లికార్జున హిల్స్‌లో సుమారు రూ.50 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మెన్ నందారం నర్సింహ గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు అవ్వగానే సీసీ రోడ్డు కూడా నిర్మించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పద్మావతి గోపి, కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు రాములు, మాజీ ఉపసర్పంచ్ చంద్రశేఖర్, బి ఆర్ ఎస్ నాయకులు, ఉపేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, కొల్లూరు గోపాల్, దాస్, కాలనీ అధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యక్షుడు రాంబాబు, జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజు, ట్రెజరీ శివ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



సర్వేనెంబర్ 374లో గల ప్రభుత్వ భూమిని కాపాడాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణం రాజంపేట నుంచి మల్కాపూర్ వెళ్లే దారిలో ప్రధాన రహదారికి అనుకొని గాలిపోచమ్మ గుడి వద్ద ఉన్న సర్వే నెంబర్ 374లో గల దాదాపు ఇరవై గుంటల ప్రభుత్వ భూమిని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని.. వెంటనే ఆ ప్రహరీ గోడను తొలగించాలని రాజంపేట ఇందిర కాలని డ్రైవర్స్ కాలని వాసులు తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కబ్జా చేస్తున్న వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని ప్రజల సామాజికగా అవసరాలకు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టేకుల అశోక్, దన్నారం ప్రశాంత్, దన్నారం, వడ్డే వీరయ్య, వెంకటేష్, పూజారి ప్రభాకర్, బండ గోపాల్, శ్రీధర్ మహేంద్ర, జగన్ మోహన్, వడ్డే కన్నయ్య, తోకలసాయి కిరణ్, తదితరులు ఉన్నారు.

కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలి

నవతెలంగాణ-కొండాపూర్



పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ కొండాపూర్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్.బాబురావు డిమాండ్ చేశారు. మండలంలోని పారిశ్రామిక క్లస్టర్ పరిధిలో గల వివిధ పరిశ్రమల్లో కనీస వేతనాల క్యాంపియన్‌లో భాగంగా సీఐటీయూ క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ.. కొండాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో దాదాపు 26 పరిశ్రమల్లో 1614 మంది కాంట్రాక్టు కార్మికులు కనీస వేతనానికి నోచుకోకుండా వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. రూ.8000 నుంచి10,000ల వేతనమిస్తూ కంపెనీ యాజమాన్యాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి కనీస వేతనాల చట్టం ప్రకారం రూ.26,000 వేతనాన్ని ఇవ్వాలన్నారు. 21 పరిశ్రమలలో ఈఎస్ఐ, పిఎఫ్, వంటి సౌకర్యాలు కాంట్రాక్టు వర్కర్లకు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. పని ప్రదేశంలో రక్షణ కల్పించ లేకపోవడం పట్లసరికాదన్నారు. ప్రతి కాంటాక్ట్ కార్మికుడికి క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. కనీస వేతనాల చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలని, కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జీపు జాతను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జీపు జాత 26న సంగారెడ్డి జిల్లాలో ఉంటుందన్నారు. ఆరోజు సంగారెడ్డిలో జరిగే బహిరంగ సభకు ప్రతీ కార్మికుడు కదిలి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ కొండాపూర్ క్లస్టర్ కమిటీ సభ్యులు శ్రీధర్, లక్ష్మీకాంత్ గౌడ్, కొండల్ రెడ్డి, తదితరులు కార్మికులు ఉన్నారు.

గణేష్‌గడ్డ సిద్ధి గణపతి ఆలయ హుండీ లెక్కింపు

- 66 రోజులకు రూ.14,16,665
- అన్నదానం హుండీ ఆదాయం రూ.90,205

నవతెలంగాణ-పటాన్‌చెరు



మండంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డలో స్వయంభుగా వెలసిన సిద్ధి గణపతి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సిద్ధి గణపతి ఆలయానికి సంబం ధించి భక్తులు కానుకల రూపంలో 66 రోజులు హుండీ ఆదాయం 14,16,665 (పద్నాలుగు లక్షల పదహారు వేల ఆరు వందల అరవై ఐదు రూపాయలు), అదేవిధంగా అన్నదానం హుండీ ఆదాయం రూ.90,205 (తొంబై వేల రెండు వందల ఐదు రూపాయలు) వచ్చినట్టు ఆలయ ఈఓ మోహన్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.శివరాజ్ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీలో వచ్చిన ఆదా యాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ అజయ్ శర్మ, జగదీశ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-సదాశివపేట

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం హరిత దినోత్సవం సందర్భంగా సదాశివపేట పురపాలక సంఘం కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక డబల్ బెడ్ రూమ్ వద్ద గల బృహత్ పట్టణ ప్రకృతి వనంలో స్థానిక ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్, మాజీ వైస్ చైర్మెన్ ప్రస్తుత కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, కౌన్సిలర్ లు చౌదరి ప్రకాష్, విద్యాసాగర్ రెడ్డి, గుండు రవి, శ్రీనివాస్, నాయకులు వీరేశం, ముబీన్, నాసిర్, సమీ, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అయూభ్ ఖాన్‌ను సన్మానించిన ఢిల్లీ వసంత్

నవతెలంగాణ-జహీరాబాద్

పవిత్ర స్థలమైన మక్కా షరీఫ్‌లో హజ్ యాత్ర చేసేం దుకు వెళ్తున్న జహీరాబాద్ పట్టణానికి చెందిన యం.పి.జె జిల్లా అధ్యక్షులు యం.డి అయుబ్ ఖాన్‌ను సామాజిక ఉద్యమకారులు ఢిల్లీ వసంత్, ఆయన బృంద సభ్యులు డికీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంఛార్జి యల్. జనార్ధన్, రైతు సం ఘం నాయకులు బిల్లిపురం మాధవ్ రెడ్డి, ప్రొఫెసర్ జనా ర్ధన్, మామిడిగి రాజు, రాములులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ.. ఏ ఆటంకాలు లేకుండా నిర్విరామంగా హజ్ యాత్ర పూర్తి చేసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఎజాజ్ భాయ్, వహీద్ భాయ్, షబ్బీర్ భాయ్, సత్తా ర్, అఫ్జల్, యాసర్ ఖాన్, ఇలియాస్ ఖాన్, బన్సి లాల్ చౌహాన్, జహుర్ సాబ్, నయిముల్ల తదితరులు పాల్గొన్నారు.

తూతు మంత్రంగా హరితహారం దినోత్సవం



నవతెలంగాణ-వట్‌పల్లి

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం చేపట్టిన హరితహారం దినోత్సవాన్ని మండ లంలో తూతూ మంత్రంగా కానిచ్చేశారు. బ్యానర్ పట్టుకొని ఎవరికి వారే గ్రామపంచాయతీ పరిధిలో ఒకటి రెండు మొక్కలు నాటి కార్యదర్శులు, సర్పంచ్‌లు చేతులు దులుపు కున్నారు. చెట్లు నాటే కార్యక్రమానికి ప్రజా ప్రతిని ధులు దూరంగానే ఉన్నారు. నిర్జప్లలోని పాఠశాల ఆవరణలో మండల ప్రత్యేక అధికారి ఫిరంగి, మండల అభివృద్ధి అధికారి జగదీశ్వర్ మాత్రమే పాల్గొని మొక్కలు నాటారు. మిగతా శాఖ అధికారులు మాత్రం ఎక్కడ కూడా కనిపించిన దాఖ లాలు లేవు. ఇప్పటికే దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్‌కు చెం దిన కార్యకర్తలను మాత్రమే అధికారులు ఆహ్వాని స్తున్నా రని.. ఇతర పార్టీలకు చెందిన వారిని ఆహ్వానించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగా బీఆర్ఎస్ అసంతృప్తి నాయకులు దశాబ్ది ఉత్సవ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నట్టు తెలుస్తోంది. అధికారుల నిర్లక్ష్యమా.. నాయకుల అలక్ష్యమో కానీ హరితహార దినోత్సవానికి ఆదరణ కరువైంది.

అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీకి చెందిన శ్రీకాకుళం వాసి కాళిదాసు(50) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. స్థానిక నాయ కుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి వి.వి.ఆర్ ఫౌండేషన్ తరపున అంత్య క్రియల నిమిత్తం రూ.5,000 సహాయాన్ని అందించారు. ఆపదలో అండగా నిలిచిన వి.వి ఆర్ ఫౌండేషన్‌కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సతీష్, రాకేష్, సురేష్, నారాయణ, సంతోష్, చిన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయం

నవతెలంగాణ-పుల్కల్

గ్రామాన్ని అన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పుల్కల్ సర్పంచ్ శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో కొన్ని చోట్ల నిధుల్లేక పలు వార్డుల్లో మురికి కాలువలు, సీసీరోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించలేకపోయామన్నారు. తాను అధికార పార్టీకి చెందిన నాయకుడిని కాకపో వడంతో నిధులు కూడా మంజూరు అవడం లేదని ఆరోపించారు. అంతేకాని తాను కావాలని ఏ కాలనీలో అభివృద్ధి పనులను నిలిపివేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పుల్కల్‌కు ప్రత్యేక నిధులు కేటాయిస్తే.. అన్ని విధాల అభివృద్ధి చేసి జిల్లా స్థాయిలో పుల్కల్ గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు.



హరితహారం దేశానికే ఆదర్శం

నవతెలంగాణ-హత్నూర

హరితహారం దేశానికే ఆదర్శమని మండల పరిషత్ అధ్యక్షులు వావిలాల నర్సింలు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల వ్యాప్తంగా చెట్లు నాటి నీరు పోసినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంతో నేడు పల్లెలన్నీ పచ్చని చెట్లతో కళకళలాడుతున్నాయన్నారు. మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేసి హరిత హారానికి ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో చేరికలు

నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని ఏటిగడ్డసంగం గ్రామంలో వైఎస్ఆర్ టీపీ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జ్ లక్ష్మారెడ్డిగారి సాయినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, గ్రామస్థులు వైఎస్ఆర్ టీపీలో చేరారు. వారికి సాయినాథ్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్లు గడుస్తున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం తన హామీలను నెరవేర్చలేదన్నారు. దళితులకు మూడేకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇవ్వకపోవడమే కాకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



నవతెలంగాణ-కంది

కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కంది మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 460 సర్వే నెంబర్ నుండి 615 సర్వేనెంబర్‌లో వరకు వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వీటిని అనేకమంది పెద్దలు ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకొని అర్హులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలన్నారు. అరుట్ల గ్రామములో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ హామీలో భాగంగా ఇంటి స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల రూపాయలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుజాత, నర్సింహులు, ఆనంద్, గౌస్, ప్రమీల, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్ల సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-కంగ్టి



మండల కేంద్రమైన కంగ్టిలోని వివిధ కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదని.. వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి దాస్ మాట్లాడుతూ.. గ్రామంలో ఏ వీధిలోకి వెళ్లినా.. వీధిలైట్లు వెలగడం లేదని.. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఓ వైపు రోడ్లు సైతం బాగాలేక పోవడం, మరో వైపు వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లో ప్రమాదాలు జరిగే అవకాశమున్నదని ప్రజలు భయపడుతున్నారు. ఈ విషయం పలుమార్లు పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వర్షాకాలం ప్రారంభమైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావల్సి వస్తుందని.. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. మండల కేవీపీఎస్ సభ్యులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులకు దరఖాస్తుల దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైద్రాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శశిధర్ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధీనంలో లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కొరకు, డిప్యూటీ చీఫ్ లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్, అసిస్టెంట్ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ పోస్టులు ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి తెలిపారు. ఈ దరఖాస్తులకు జులై 1 చివరి తేదీ అన్నారు. పూర్తి వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం కోర్టు వెబ్సైట్ https:ll districts.ecourts.gov.in/sangareddy సంప్రదించాలన్నారు.



ఎంపీడీవో వేధిస్తున్నాడని ఎంపీపీకి వినతి

నవతెలంగాణ-చేర్యాల



తమను చేర్యాల ఎంపీడీవో తారీక్ అన్వర్ వేధిస్తున్నాడని, అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీపీ కరుణాకర్‌కు వినతిపత్రం అందజేశారు. చేర్యాల మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిపరిచేందుకు అనునిత్యం ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న తమను ఎంపీడీవో ఇబ్బందులకు గురి చేస్తూ, పల్లె ప్రగతి పనులు సర్పంచులు చేయకపోతే కార్యదర్శులే తమ సొంత డబ్బులతో పూర్తి చేయాలని, అలా చేయకుండా ఎక్కువగా మాట్లాడితే సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నాడని తెలిపారు. రకరకాలుగా మనోవేదనకు గురి చేస్తునందున తమను వేరే మండలాలకు బదిలీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - చిన్నకోడూరు



రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యేవిధంగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై సైనికునిలా పని చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ పిలుపునిచ్చారు. చిన్నకోడూరు మండలం కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. కాంగ్రెసు ప్రభుత్వం తోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మీసం మహేందర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరీ కల్లూరి నర్సయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఉడుత జయంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు సందబోయిన పర్శరాం, ఉపాధ్యక్షులు కాలువ జగన్, యూత్ కాంగ్రెస్ సెక్రెటరీలు మహేందర్, మాసం శేషు, నాయకులు ఇరుమల్ల ఎల్లయ్య, మధు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరితోత్సవం



















పచ్చని రాష్ట్రంగా తెలంగాణ
జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు

తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చటి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మద్దూరు మండల కేంద్రంలో హరితహారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చటి తెలంగాణ చేసేందుకు సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను ప్రతి ఒక్కరు సంరక్షించాలని ఆయన కోరారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు ముళ్ళ కొమ్మలను ఏర్పాటు చేయాలని అధికారులకు ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడకు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్, సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ బోప్ప కనకమ్మ నాగయ్య, ఉప సర్పంచ్ ఎండి ఆరిఫ్, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్లు చేట్కూరు తిరుపతి, కాసర్ల కనకరాజు, పీఏసీఎస్ డైరెక్టర్లు కాటం బాలయ్య, మేక మల్లేశం, ఎంపీడీవో శ్రీనివాస్, ఈసీ పరశురాం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హరిత తోరణంగా మారిన గజ్వేల్
జిల్లా పరిషత్ చైర్మన్ రోజా రాధాకృష్ణశర్మ

నవ తెలంగాణ-గజ్వేల్

హరిత తోరణంగా పచ్చని ఆకుపచ్చగా గజ్వేల్ మారిందని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. సోమవారం హరిత తెలంగాణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ అర్బన్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014 ముందు ఉమ్మడి మెదక్ జిల్లాలో అటవి ప్రాంతం ఏ పరిస్థితుల్లో ఉండేదో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆకుపచ్చగా మార్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని వారు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మొత్తం 24 మండలాల్లో ఏ గ్రామానికి వెళ్లినా ఆకుపచ్చ తోరణంగా కనిపిస్తుందన్నారు. గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల ప్రాంతాలన్ని ఆకుపచ్చగా మారినట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా మొక్కలు నాటిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు. మంత్రి హరీష్ రావు సిద్దిపేట జిల్లాపై ముఖ్యంగా హరితహారంపై మక్కువ చూపి సిద్దిపేట జిల్లాను ఆకుల తోరణంగా మార్చినట్లు వారు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వరకు ప్రధాన జాతీయ రోడ్డు ఇప్పుడు ఆకుపచ్చగా మారిపోయిందన్నారు. రోడ్డుకు ఇరుపక్కల కాకుండా డివైడర్‌లో కూడా మొక్కలు నాటి సిద్దిపేట జిల్లాలో ఆకుపచ్చగా మార్చిన ఘనత మంత్రి హరీష్ రావుకే దక్కిందన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి మూలంగానే మొక్కలు చెట్లు పెంచామన్నారు. మంత్రి ఎక్కడకు వెళ్లినా వంగిపోయిన మొక్కలు ఉంటే కారు దిగి సరి చేస్తారని వారు గుర్తు చేశారు. అదే స్థాయిలో ప్రతి గ్రామ పంచాయతీలో పార్కులు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏ కార్యక్రమం తీసుకున్నా ఈ దశాబ్ది కాలంలో ప్రజా ఉపయోగకరమైన కార్యక్రమాలు తీసుకున్నామన్నారు. రానున్న కాలంలో సిద్దిపేట జిల్లా ప్రాంతమంతా ఆకుపచ్చగా మారి వర్షాలు మరిన్ని కురుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ విజయేందర్ రెడ్డి, గజ్వేల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి కిరణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, జెడ్పిటిసి మల్లేశం, బాల మల్లు యాదవ్, పి ఎస్ ఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిల్ సభ్యులు రజిత గౌడ్, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, చందన రవి, అర్చన శివకుమార్, బొగ్గుల చందు, పార్టీ నాయకులు రాజిరెడ్డి, గజ్వేల్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించేన కేసీఆర్
మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

నవ తెలంగాణ-గజ్వేల్

ఆకుపచ్చని తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించి నవ వసంతాల హరితోత్సాన్ని నిర్వహించుకుంటున్నామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెలంగాణ హరిత దినోత్సవ సందర్భంగా పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన సొంత గ్రామమైన గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా సర్పంచ్ చాడ నవీన శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హరితోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు. తెలంగాణలో పచ్చదనానికి పునర్జీవం పోస్తు అడవులకు పూర్వవైభవం తెచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. మొక్కల పెంపకంలో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడితేనే మానవాళికి మనుగడ సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి ఇంటి ముందు మొక్కలు నాటినట్లయితే గ్రామం పూర్తిగా పచ్చదనంతో నిండి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రమేష్ గౌడ్, అహ్మద్, నిజామోద్దీన్, లక్ష్మణ్, సత్యం కరోబర్ స్వామి, పోచయ్య, మహిళలు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతమడక గ్రామంలో హరిత దినోత్సవం

నవతెలంగాణ -సిద్ధిపేటరూరల్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక గ్రామంలో హరిత దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి చంద్రరావు, జెడ్పీటీసీ శ్రీహరి గౌడ్ పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ బైరి హంసంకేతన్ రెడ్డి, అటవీ శాఖ అధికారి స్నేహలతతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ స్వగ్రామమైన చింతమడకను హరిత చింతమడకగా మార్చాలని దీనికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర పీసీసీఎఫ్, ఐఎఫ్ఎస్ ఆర్ ఎం డోబ్రియల్ అధికారి చింతమడక గ్రామాన్ని దత్తత తీసుకున్నారని ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి హరిత చింతమడక హరిత గ్రామంగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోత్కు రవి, డిప్యూటీ రేంజ్ అధికారి నిలేందర్, బీట్ అధికారి రామకృష్ణ, శ్రీకాంత్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం మండలంలోని అయా గ్రామాల్లో హరిత దినోత్సవ సంబురాలను ప్రజాప్రతినిధులు ఘనంగా జరిపారు. మండల పరిధిలోని గాగిల్లపూర్ గ్రామ సర్పంచ్ అన్నాడీ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన హరిత దినోత్సవానికి డీఎల్పీఓ దేవకిదేవి ముఖ్య అతిథిగా హజరై స్మశాన వాటిక ఆవరణ వద్ద మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. తోటపల్లిలో సర్పంచ్ నర్సింగరావు అధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీటీసీలు నల్లగొండ లక్ష్మికొమిరే మల్లేశం,ఎంపీఓ విష్ణు వర్ధన్, అయా గ్రామాల వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో సోమవారం హరితోత్సవంలో భాగంగా మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మర్కుక్ జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్‌లు మొక్కలను నాటారు. అనంతరం వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఏపీడీ కౌసల్యా దేవి, ఎపీడీవో ప్రవీణ్‌తో కలసి గత హరిత హారం కార్యక్రమంలో నాటిన మొక్కలకు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి మానవ హారం నిర్వహించారు. సర్పంచుల ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో హరితోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్ చారి, ఎంపీవో రాజిలింగం, పంచాయతీ కార్యదర్శి మౌన, ఈసీ రాజు, టీఏ స్వామి, సిఏలు కవిత , కావ్య, హెచ్ఎం కృష్ణమూర్తి ,ఉపాధ్యాయులు శ్రీనివాస్ రావు, రమణరావు, విద్యాధర్ రెడ్డి, వందన, లావణ్య, గ్రామ కోఆప్షన్ సభ్యులు మోహన్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, విద్యార్థులు, తదితరులున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో హరిత దినోత్సవ సంబురాలు అంబరాన్నాంటాయి. ఎంపీపీ నిర్మల, సర్పంచ్ ద్యావనపల్లి మంజుల,ఎంపీటీసీ గుభిరే శారద కలిసి హరిత దినోత్సవ సందర్భంగా సోమవారం మొక్కలు నాటారు.ఎంపీటీసీ మహేందర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు, అధికారులు కోరారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లో హరితహారం కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, అనే నినాదాలతో నర్సరీ కేంద్రాల వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడే మొక్కలు నాటారు. వివిధ గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాల్లో జడ్పీటీసీ తడిసిన ఉమా, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ కిషన్, రాజగోపాల్ పేట ఎస్సై రాజు గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-సిద్దిపేట

మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట పట్టణం హరిత వనంగా మారిందని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ హరితోత్సవంలో భాగంగా రంగనాయక సాగర్ వద్ద గల తేజోవనంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలసి ఆమె మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడా కూడా మొక్కలు చనిపోకుండా, ప్రతి రోజు మొక్కలకు నీరు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎన్సాన్ పల్లి వైపున డివైడర్ లో 10 వేలకు పైగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్‌లు నాయకం లక్ష్మణ్, వినోద్ గౌడ్, వడ్లకొండ సాయి, బందారం శ్రీలత, నాయకులు వంగ తిరుమల రెడ్డి, బందారం రాజు, కాటం రఘురాం, అల్లం ఎల్లం, సర్పంచ్ రవీందర్ గౌడ్, నాగుల ప్రశాంత్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-దుబ్బాక

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన "హరితోత్సవం" కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (కెసిఆర్ స్కూల్)లో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిత తెలంగాణ లక్ష్యంగా సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, తద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ మొక్కలు నాటాలని పుర ప్రజలను కోరారు.దుబ్బాక మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి,సీఐ మున్నూరు కృష్ణ,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్నేహలత,కౌన్సిలర్లు ఇల్లందుల శ్రీనివాస్,దేవుని లలిత,ఆస యాదగిరి,కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి,కేసిఆర్ స్కూల్ హెచ్ఎం గాజుల రామచంద్రం,డిఆర్ఓ నీలేందర్,ఎఫ్ బిఓ శ్రీకాంత్,సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి,మెప్మా ఆర్పీలు,దుబ్బాక బస్సు డిపో ఇన్చార్జి మల్లయ్య గౌడ్,మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్,ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్,బిఆర్ఎస్ నాయకులు హార్డ్ వర్కర్ పండు, పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ తెలంగాణ తల్లి ఆకుపచ్చ చీర కట్టుకున్నట్టు.. భూమి తల్లికి పచ్చని రంగేసినట్టు.. ఇప్పుడు ఎక్కడ చూసినా పచ్చని చెట్లతో తెలంగాణ ప్రాంతం అలరారుతున్నదని జెడ్పీటీసీ వంటేరు సుధాకర్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా సోమవారం తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగానే తెలంగాణ హరితోత్సవం సందర్భంగా జగదేవపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ మమత అంజిరెడ్డితో కలిసి జడ్పీటిసి వంటేరు సుధాకర్ రెడ్డి హరితహారం కార్యక్రమం ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలపాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతం నేడు పచ్చని పంటలు, చెట్లతో గ్రామాలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. ఈ హరితహారంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలు, పల్లె ప్రకృతి వనలతో గ్రామాలు రూపురేఖలు మరాయన్నారు. హరిత గ్రామాలు తీర్చిదిద్దడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దులు, మాజీ సర్పంచ్ మహేందర్ గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్ వర్మ, కార్యదర్శి వెంకట్, టిఏ సంతోష్, వెంకటచాల్మ రెడ్డి, నర్సింలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తొగుట

అటవీ శాతాన్ని పెంచాలన్న సదుద్దేశంతో సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని సర్పంచ్‌లు పేర్కొన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు కోట్ల మొక్కలను నాటి సంరక్షించడంతో హరిత రాష్ట్రంగా పేరు పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, అధికారులు, అనదికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. తొగుట పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్ఐ కరు ణాకర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మల్లేశం గౌడ్, కానిస్టేబుల్ యాదగిరి, రాజేష్, రాకేష్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ దుబ్బాక రూరల్

హరితోత్సవంలో తెలంగాణ ఆకుపచ్చ రాష్ట్రంగా సీఎం కేసిఆర్ తీర్చిదిద్దారని పద్మనాభునిపల్లి సర్పంచ్ కండ్లకోయ పరశురాములు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పద్మనాభునిపల్లి గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు జానకిరామ్, వార్డు మెంబర్ కూర రాములు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హరితోత్సవం కార్యక్రమం ద్వారా ఆకుపచ్చ తెలంగాణగా మారిందన్నారు. గ్రామంలో నాటిన మొక్కలు ఆనంద, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచటమే కాక అందరికీ స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఇంటా ఒక మొక్క నాటి గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం, గ్రామస్తులు, సెక్రెటరీ తదితరులున్నారు.











ఘనంగా రాహుల్ గాంధీ జయంతి వేడుకలు



















నవ తెలంగాణ-సిద్దిపేట

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ఎన్నికవడం ఖాయమని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్య వర్మ , డీసీసీ ప్రధాన కార్యదర్శి మార్క సతీష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ముస్తాబాద్ చౌరస్తాలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగధనుల కుటుంబంలో జన్మించిన రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఆయన స్ఫూర్తితో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ హత్ సే హాథ్ జోడో కార్యక్రమం నిర్వహించారని, ప్రజల నుంచి కూడా అంతే స్పందన వచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి మరింత ఆయురారోగ్యాలు ప్రసాదించాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గంప మహేందర్, సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, దాస అంజయ్య మండల అధ్యక్షులు తప్పెట శంకర్, మిట్టపల్లి గణేష్, బర్మా రామచంద్రం, అజ్జు యాదవ్, జిత్తు, నరసవ్వ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్

ఏఐసీసీ నేత, పార్లమెంటు సభ్యులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుక సందర్భంగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో కేకు కోసి వేడుకలు నిర్వహించుకున్నారు. అంతేకాకుండా గజ్వేల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు బెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అని ఆయన తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా దిగజారుడు రాజకీయాలు చేస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ప్రమోద్ కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, పార్టీ నాయకులు రంగారెడ్డి, మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, గుంటూాకు శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నక్క రాములు, రాజు, శ్రీధర్, వహీద్ ఖాన్, విట్టల్, మల్లేశం, మోహన్, పరుచూరు రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ పీసీసీ డేలిగేట్ సభ్యులు మాదాటి జస్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జస్వంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రం లో పేద ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవడం కోసం దేశాన్ని ఐక్యం చేయడం కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 150 రోజులు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన నాయకుడు రాహుల్ గాంధీ పాదయాత్ర స్ఫూర్తిగా నిలిచిందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా పని చేసి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్దిపేట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు మ్యాడం బాలకృష్ణ రెడ్డి,బురుగుపల్లి కృష్ణారెడ్డి, దేవేందర్ చౌదరి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజ్జర్, సిద్దిపేట జిల్లా కార్యదర్శి కొప్పురాజురవి, దాచారం వెంకట్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ఆనంద్,ఎల్లం.బాలరాజు,రవీందర్, జిల్లా, మండల, గ్రామ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, మున్సిపల్ ఫోర్ లీడర్ చిత్తారి పద్మ, కౌన్సిలర్స్ వల్లపు రాజు , మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, జిల్లా మాజీ కన్వీనర్ వెన్నరాజు, బూరుగు కృష్ణస్వామి, బీసీ సెల్ మండల అధ్యక్షులు పోతుగంటి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం దుబ్బాక మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ద్వారా ప్రజలను మేల్కొల్పాడన్నారు. దుబ్బాకలోను కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు అనంతల శ్రీనివాస్, నాయకులు మంద శ్రీనివాస్, ఆకుల భరత్, కొంగరి రవి, బాస మధు, రాజిరెడ్డి, శ్రీరామ్ నరేందర్, చంద్రం,పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అధ్వర్యంలో గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు మర్కుక్ కాంగ్రెస్ నాయకులు హజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, సీనియర్ నాయకులు బబ్బూరి మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్,నాయకులు గుర్రాల నర్సింలు, చీకోటి రవి,తదితరులున్నారు.

నవతెలంగాణ-అక్కన్న పేట

అక్కన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ భూపతి ముకుందా రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బండి కుమార్ గౌడ్, అక్కన్నపేట టౌన్ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసిలు మ్యాక రమేష్, బానోత్ భాస్కర్ నాయక్, బిసి సెల్ మండల అధ్యక్షుడు చింతల బాలరాజు, కిసాన్ మండల అధ్యక్షులు కొత్తకొండ పొడిశెట్టి, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుగుర్తి బాలరాజు, బందారం శ్రీనివాస్, సంపత్ రెడ్డి,మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నకీర్తి మునిరాజ్, ఎండి అక్బర్, యూత్ కాంగ్రెస్ నాయకులు పత్తిపాక త్రిమూర్తి, పంగా రాకేష్, కిన్నర ప్రశాంత్, ఎస్సీ సెల్ నాయకులు బెజ్జంకి సారయ్య, వల్లపు పరుశురామ్, నందారపు సంపత్, కుందేనావానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో వర్గల్ మండలంలోకాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తునికి ఖల్సా, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకి నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, వాటర్ బాటిల్స్ పంపిణి చేశారు. వర్గల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు వితరణ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిట్ల రాజు, పిట్ల కృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు సల్మాన్ , మహబూబ్, పంజాల సాయి గౌడ్, శ్రవణ్, శ్యామ్, నందకుమార్ ప్రశాంత్, మహేష్, శ్రీకాంత్, శ్రీహరి , రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ నేత కనకయ్య జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పార్టీ నాయకులు మరికంటి కనకయ్య జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి స్థానిక మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిస్తున్నారు. జన్మదిన వేడుకలు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, పార్టీ నాయకులు కనుకయ్య, రవీందర్, ఉప్పల మెట్టయ్య, దుర్గాప్రసాద్, నవాజ్ మీరా, నంగునూరు సత్యనారాయణ తదితరులు హాజరై కనకయ్యను ఆశీర్వదించారు.

వేములఘాట్‌లో హరితహారం

నవతెలంగాణ-తొగుట

మండలం లో 10 ఎకరాలలో సంపద వనం నిర్మిస్తున్నామని డిఆర్డీఓ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘట్ గ్రామ శివారులోని రిజర్వాయర్ కట్ట ఆవరణలో 100 మొక్కలను నాటారు. కార్యక్రమంలో చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింలు,పీఆర్ ఏఈ రామకృష్ణ రెడ్డి,ప్లాంటేషన్ మేనేజర్ మహేందర్ రెడ్డి,ఇంచార్జి ఎంపీడీఓ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, ఎన్ఆర్ఈ జియెస్ టిఏ లు శ్రీనివాస్, రమేష్, సంతోష్,ఎఫ్ కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రి హరీష్‌రావు పర్యటన

నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 20న నంగునూరు మండలంలోని పాలమాకుల, అప్పలాయ చెరువు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమాలకు మంత్రి హరీష్ రావు హాజరు కానున్నట్లు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఆనగోని లింగంగౌడ్ తెలిపారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎలక్షన్లు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్దే విజయం

చిన్న నిజాంపేట్‌లో నూతన కమిటీల ఎన్నిక

నవతెలంగాణ దుబ్బాక రూరల్

రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని, దుబ్బాక గడ్డపై తిరిగి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని దుబ్బాక పీఏసిఎస్ చైర్మన్ షేర్ల కైలాస్, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్ అన్నారు. సోమవారం అక్బర్ పేట భూంపల్లి మండలం పరిధిలోని చిన్న నిజాంపేట్ గ్రామంలో టిఆర్ఎస్వి, టిఆర్ఎస్ యూత్, టిఆర్ఎస్ సోషల్ మీడియా కమిటీలు, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి ఆర్ ఎస్వీ గ్రామ అధ్యక్షులుగా చింతాకులస్వామి, సోషల్ మీడియా అద్యక్షుడు గా షేర్ల విజయ్,సోషల్ మీడియా అధ్యక్షుడు గా సంఘం రమేష్ లు ఏకగ్రీవమైనట్లు వారు మీడియాతో వెల్లడించారు. ఎలక్షన్లో ఓట్ల కోసం మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇండ్లల్లోకి వస్తారని అన్నారు.రాబోయే రోజుల్లో దుబ్బాకలో గులాబీ జెండా ఎగిరే విధంగా కంకణబద్దులై కార్యకర్తలంతా పని చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వి దుబ్బాక మండల అధ్యక్షులు పరశురాం,గ్రామ కమిటీ అధ్యక్షులు మెరుపుల స్వామి గౌడ్ , చౌదర్పల్లి మహంకాళి, కనికీ పరశురాములు, శనగపల్లి దుర్గయ్య, కోనాపురం, పరశురాములు తదితరులు పాల్గొన్నారు

పైలేరియా కార్డుల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో పైలేరియాకు సంబంధించిన 19 మంది పేషెంట్లకు గ్రామ సర్పంచ్ పంగ కుమార్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిచరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రేణుక, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిర్మూలించాలి

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవ తెలంగాణ- గజ్వేల్

ఆధునిక యుగంలో మూఢనమ్మకాల పేరుతో దళిత బలహీన వర్గాలపై అత్యంత కిరాతకమైన దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కోల్కూర్ గ్రామంలో చేతబడి బాణామతి చేస్తున్నారనే నెపంతో దళిత బలహీన వర్గాలకు చెందిన వారిని గ్రామపంచాయతీ వద్ద తలకిందులుగా కట్టేసి అత్యంత కిరాతకంగా దాడి చేయడాన్ని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. గ్రామంలో ఒకతనికి సుస్తీ అయితే మంత్రగానీ దగ్గరికి వెళితే మీ గ్రామంలో చేతబడి బాణామతి చేసే వాళ్ళు ఉన్నారని చెప్పడంతో మాదిగ కులానికి చెందిన ముత్తంగి యాదయ్య శ్యామలను గ్రామపంచాయతీ వద్ద కట్టేసి తీవ్రంగా దాడి చేశారని ఆయన తెలిపారు..ముదిరాజ్ కులానికి చెందిన అతడిని కూడా కొట్టేందుకు ప్రయత్నించగా అతను అక్కడి నుంచి పారిపోయినట్లు ఆయన చెప్పారు. గ్రామంలో ఎవరైనా పోలీసులకుగాని, ఇతరుల గాని చెప్తే వారిని కూడా వదిలేది లేదని బెదిరింపులకు గురి చేస్తున్నారని చెప్పారు.. మూఢనమ్మకాల పేరుతో అమాయకులైన వారిపై చాలా దుర్మార్గంగా దాడులకు పాల్పడడం దారుణం. ప్రపంచమంతా కంప్యూటర్ యుగంలో మునిగితేలాడుతుంటే ఇంకా చేతబడి బాణామతి మూడ నమ్మకాల పేరుతో అత్యంత దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతున్నారు. ఈ దాడులన్నీ దళితులు బలహీనవర్గాలపైనే



జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ఉన్నత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని,దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని,కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని దళిత బహుజన ఫ్రంట్ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు వినయ్ కుమార్,మంజీర దళిత సేవా సమితి జిల్లా అధ్యక్షులు పి కిరణ్,డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ చేసుకున్న రైతు లింగం కుటుంబాన్ని అదుకోవాలి

నవ తెలంగాణ - దౌల్తాబాద్ : వ్యవసాయంలో నష్టం తో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చెసుకున్న సూరంపల్లి గ్రామానికి చెందిన దళిత రైతు బోల్లం లింగం కుంటుంబాన్ని ప్రభుత్వం అదుకొవాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి.శంకర్ డిమాండ్ చేశారు. ఇటీవల ఆత్మహత్య చెసుకున్న బొల్లం లింగం కుటుంబాన్ని శంకర్ సోమవారం పరామర్శించి ఆత్మహత్యకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సాగు నీటి సౌకర్యం లేక వ్యవసాయాన్ని నిలబట్టుకునెందుకు అప్పులు చేసి మూడు బొర్ వెల్స్ వేశాడని నీళ్ళు పడకపొవడంతో నష్టపొయడన్నారు. అప్పుల కొసం భూములు అమ్ముకున్న అప్పులు తీరలేదన్నారు. కుటుంబాన్ని పొషించుకొవడానికి పాల వ్యాపారం చేశాడని,



ఆటో,కారులు కూడ నడపరన్నారు..194 జిఓ ప్రకారం ఆత్మహత్య చేసుకున్న రైతు బొల్లం లింగం కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం దౌల్తాబాద్ తహిసిల్దర్‌కు వినతి పత్రం సమర్పించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు,ఉప సర్పంచ్ బొల్లం స్వామి.గ్రామ నాయకులు ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వైయస్సార్ టీపీ దుబ్బాక ఇన్చార్జి

మండల పరిధిలోని సూరంపల్లి గ్రామంలో ఇటీవల అప్పుల బాధ భరించలేక యువరైతు బొల్లం లింగం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకొని వైఎస్ టి పి దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జి విజయభాస్కర్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పమర్శించారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొల్లం స్వామి మరణించడం చాలా బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలన్నారు.

ప్రతి ఇంటా పాడిపంటలు అభివృద్ధి చెందాలి

ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు గనుప లక్ష్మారెడ్డి

నవతెలంగాణ వర్గల్ : మేలు రకం పశు సంపద ఉత్పత్తితోనే రైతులకు అధిక ప్రయోజనం ఉంటుందని, ప్రతి ఇంటా పాటిపంటలు అభివృద్ధి చెందాలని ఉమ్మడి మెదక్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గనుక లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అవుసులోని పల్లిలో మేలు జాతి లేగ దూడల ప్రదర్శనను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణ ఫలితంగా మేలు రకం, సంకరజాతి లేగ దూడల ఉత్పత్తి ఉండి వాటి సంరక్షణతోనే విస్తృత ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. నట్టల నివారణ చర్యలు తీసుకొని పక్షంలో ఏలిక పాములు, జలగలు, బద్దె పురుగులు వంటి అంతర పరాన్న జీవులు జీర్ణాశయం, పేగులలో ఉండి పోషక పదార్థాలు దూడకు అందనివ్వకుండా రక్తాన్ని పీల్చి బలహీనం చేస్తాయని పేర్కొన్నారు. నట్టల వలన దూడలు ఎదగకుండా బలహీనంగా సన్నగా ఉంటాయని, దీని దృష్టిలో పెట్టుకొని నట్టల నివారణ మందు వేయాలని సూచించారు. గాలికుంటు, గొంతువాపు, దమ్మ రోగం, బ్రూసెల్లాసిస్ వంటి అంటు రోగాలు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు టీకా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎండు గడ్డిలో ఉండే సెల్యూలోస్ ను లేగ దూడలు జీర్ణించుకోలేవని, పప్పు జాతి లేత ఆకులు లేగ దూడలకు ఆహారంగా అందించాలని



అన్నారు. పశు సంపద ఉత్పత్తి, సంరక్షణ లక్ష్యంగా జిల్లాలో 150 మంది గోపాల మిత్రలు ఇంటింటికి తిరుగుతూ పశువులను వ్యాధుల బారిన పడకుండా చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల నుండి విజయ డైరీ నేరుగా పాలు సేకరిస్తుండగా, పాడి రైతులకు రుణ సదుపాయం సైతం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల చర్యలు తీసుకుంటుండగా, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ , ఎంపీపీ అధ్యక్షులు లతా రమేష్ గౌడ్, జెడ్పిటిసి బాలు యాదవ్ , మండల వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి , పశు వైద్యాధికారి సృజన , గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర నేత రాంబాబు , జిల్లా అధ్యక్షులు సింగం రాజు , గోపాలమిత్రలు షాదుల్లా , భాస్కర్ గౌడ్ , స్వామి , సత్తార్ , సురేష్ , అఫ్జల్ , యాదగిరి , ఆంజనేయులు , రవి పాల్గొన్నారు .

ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌కు సెట్ బ్యాక్ నిబంధనలు వర్తించవా?

కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలో నూతనంగా ఇల్లు నిర్మిస్తున్న ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌కు మున్సిపల్ సెట్ బ్యాక్ నిబంధనలు వర్తించవా? అని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చట్టాన్ని తుంగలో తొక్కేలా ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా బిల్డింగ్ నిర్మించారని, ఆయనకు నిబంధనలు వర్తించవా అని మండిపడ్డారు. బిల్డింగ్ అనుమతుల కోసం సిద్దిపేట పట్టణంలోని ప్రజలు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, ఎమ్మెల్సీ ఫారుక్‌కు మాత్రం చిటికెలో అనుమతులు లభించాయని ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయం చుట్టు సామాన్య ప్రజలు తిరుగుతున్నా అధికారులు అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న బిల్డింగ్ ను మున్సిపల్ అధికారులు తొలగించాలని కోరారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లను మున్సిపల్ అధికారులు జెసిబిలతో కూల్చి వేస్తున్నారని, మరి ఆయన విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలని మంత్రి హరీశ్‌రావు చెప్తున్నారని, ఆయన మాట అంటే ఆ పార్టీలో



నాయకులకు విలువ లేదా అని ప్రశ్నించారు. బిల్డింగ్ పైఅంతస్తులకు అనుమతులు లేకపోవడంతో ఇల్లు కట్టనివ్వడం లేదని, ఫారుక్ హుస్సేన్ అన్ని ఫ్లోర్లకు అనుమతులు ఎవరిచ్చారని అన్నారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మంజుల ఏం సమాధానం చెప్తారని అన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ యజమానులు ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ ఇల్లు సెట్ బ్యాక్ విషయమై రెండు రోజుల్లో మున్సిపల్ అధికారులు నిర్ణయం చేసుకోవాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నంగునూరు మండల అధ్యక్షులు తప్పెట శంకర్, యువజన సిద్దిపేట పట్టణ అధ్యక్షులు గయాస్, మైనార్టీ పట్టణ ఉపాధ్యక్షులు ఫయాజ్, అశోక్ గౌడ్, జిత్తు పాల్గొన్నారు.